ANDHRAJYOTHY
# ఆంధ్రజ్యోతి
5





చిత్తూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 4 ఏప్రిల్ 2025






చిత్తూరు సీబీరోడ్డులో కురుస్తున్న వర్షం

## చినుకు పలకరింత

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది. ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా రెండురోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి 37 డిగ్రీలకు తగ్గాయి.చిత్తూరులో గురువారం ఉదయం నుంచే ఆకాశమంతా మబ్బులతో నిండిపోగా 9 గంటల ప్రాంతంలో చిరుజల్లులు కురిసాయి.చాలారోజుల తర్వాత గంటపాటు వాన పడడంతో నగర ప్రజలు ఆనందపడ్డారు. వర్షపు జల్లుల్లోనే పిల్లలు తడుస్తూ పాఠశాలలకు వెళ్ళగా, ఉగ్యోగులు కార్యాలయాలకు కదిలారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత మళ్ళీ ఎండవేడిమి ప్రారంభమైంది.

- చిత్తూరు కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి

## సాయం సంధ్య సౌందర్యం

చిత్తూరు నగరంలోని గంగినేని చెరువు సమీపంలో గురువారం సాయంత్రం 6.45 గంటల సమయంలో కనిపించిన దృశ్యమిది. ఆకాశంలో నీలిమేఘాలు చెరువు నీటిలో ప్రతిబింబిస్తూ దర్శనమివ్వడం సాయంత్రపు నడకకు వచ్చినవారికి ఆహ్లాదాన్ని కల్గించింది.



## స్థిరాస్తి దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు నేటినుంచి స్లాట్ బుకింగ్ సేవలు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థిరాస్తి దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు శుక్రవారం స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభిస్తున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ వెంకటరమణమూర్తి తెలిపారు. ప్రయోగాత్మకంగా చిత్తూరు ఆర్వో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఇందుకు ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. తర్వాత దశలవారీగా జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఈ విధానం అమల్లోకి వస్తుందన్నారు. ఈ ప్రక్రియ కోసం రిజిస్ట్రేషన్‌శాఖ అధికారిక వెబ్‌సైట్ registration.ap.gov.inను సందర్శించాలన్నారు. స్లాట్ బుకింగ్ మాడ్యూల్ ద్వారా లేదా పబ్లిక్ డేటా ఎంట్రీ ద్వారా,క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవచ్చని డీఆర్ వివరించారు. స్థిరాస్తి దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుకింగ్ విధానంపై కక్షిదారులకు అవగాహన కూడా కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 63 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి కౌన్సెలింగ్ గురువారం చిత్తూరులోని జిల్లాపరిషత్ మీటింగ్ హాల్లో జరిగింది. గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-5 కార్యదర్శులుగా పదోన్నతి కల్పించారు. జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీపీవో సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.



# మార్గదర్శుల కోసం...

**● బంగారు కుటుంబాల ఎదురుచూపులు ● పీ4కు 65 వేల కుటుంబాల ఎంపిక**

చిత్తూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పేదరికమే లేని సమాజ నిర్మాణం కోసం పబ్లిక్ ప్రైవేటు పీపుల్ పార్టనర్‌షిప్ (పీ4) అనే కార్యక్రమానికి తొలి అడుగు పడింది.ఎన్నికల ముందు నుంచి సీఎం చంద్రబాబు చెబుతూ వచ్చిన పూర్ టు రిచ్ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉగాది సందర్భంగా సీఎం చంద్రబాబు అమరావతిలో ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌తో కలిసి ప్రారంభించారు. సేవా మనస్తత్వం ఉన్న సంపన్న కుటుంబాలు సమాజంలో అట్టడుగున ఉన్న కుటుంబాలను దత్తత తీసుకుని వారి అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం.సాయం పొందే కుటుంబాలను బంగారు కుటుంబాలని, సాయం చేసేవారిని మార్గదర్శులని పిలవనున్నారు.



మన జిల్లాలో 4.86 లక్షల కుటుంబాలుండగా.. పీ4 అమలుకు ఫిబ్రవరి, మార్చి నెలల్లో 4.78 లక్షల కుటుంబాల్ని సర్వే చేశారు. సచివాలయ ఉద్యోగులు తమ క్లస్టర్‌లోని కుటుంబాలకు సంబంధించిన 27 రకాల ప్రశ్నల్ని అడిగి వారి లాగిన్‌లో నమోదు చేశారు. సర్వేలో 65,219 కుటుంబాలు పీ4 పరిధిలోకి వస్తాయని ప్రాథమికంగా గుర్తించారు. జిల్లా అధికారులు ఈ వివరాలను ప్రభుత్వానికి పంపించగా అక్కడ మరోసారి వడపోశాక అత్యంత నిరుపేదలను పీ4 వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. విద్యుత్తు, గ్యాస్ సౌకర్యం, సంపాదన వనరులు లేని కుటుంబాలనే దీని పరిధిలోకి తేనున్న క్రమంలో ప్రస్తుతం గుర్తించిన కుటుంబాల్లో 50 శాతానికిపైగా తగ్గిపోయే అవకాశం ఉందని తెలుస్తోంది. వారికి సాయం చేయడానికి ముందుకు వచ్చే సంపన్నులకు ప్రభుత్వం అనుసంధానకర్తగా వ్యవహరిస్తుంది.అయితే ఈ విషయంలో ప్రభుత్వం ఎవరినీ ఒత్తిడి చేయదు.బంగారు కుటుంబంలో చదువుకునేవారుంటే ఆర్థిక సాయం, నిరుద్యోగులకు ఉపాధి, నైపుణ్య శిక్షణ వంటివి అందించాలి. భవిష్యత్తులో ఆ కుటుంబం మరొకరిపై ఆధారపడకుండా మార్గం చూపించాలి. ఈ కార్యక్రమం అమలు తీరును కలెక్టరు పర్యవేక్షిస్తారు.

- **● జిల్లాలో మొత్తం కుటుంబాలు: 4,86,848**
- **● సర్వే చేసినవి: 4,78,229 (98.23%)**
- **● పీ4కు ఎంపిక చేసినవి: 65,219**

● అత్యధికంగా.. చిత్తూరు నగరంలోని 5035 కుటుంబాలను పీ4 కార్యక్రమానికి ఎంపిక చేశారు. జీడీనెల్లూరు మండలంలో 2548, పెనుమూరులో 2195, ఎస్ఆర్‌పురంలో 2337కుటుంబాలను, కుప్పంలో 2288, రామకుప్పంలో 2358, శాంతిపురంలో 2656, బైరెడ్డిపల్లెలో 2132, వి.కోటలో 2267, బంగారుపాళ్యంలో 2567, ఐరాలలో 2377, తవణంపల్లెలో 2007 కుటుంబాలను ఎంపిక చేశారు.

● అత్యల్పంగా.. పాలసముద్రం మండలంలో 573కుటుంబాలను, నగరి అర్బన్‌లో 825, సదుంలో 958, రొంపిచెర్లలో 978 కుటుంబాలను ఎంపిక చేశారు.

## మొదలైన టెన్త్ మూల్యాంకనం

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ తొలి రోజైన గురువారం ప్రశాంతంగా మొదలైంది. స్థానిక పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీఈవో, క్యాంపు అధికారి డీఈవో వరలక్ష్మి ఆధ్వర్యంలో పరీక్షల సహాయ కమిషనర్, ఏడీ వెంకటేశ్వరరావు సంయుక్త ఆధ్వర్యంలో జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ జరిగింది. చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు ఉదయం 8 గంటలకు రిపోర్టు చేశారు. మధ్యాహ్నం వరకు ఆయా సబ్జెక్టుల వారీగా విధులు కేటాయిస్తూ, ఐడీ కార్డులు అందజేశారు. మధ్యాహ్నం నుంచి అన్ని సబ్జెక్టుల జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభమైంది. అసిస్టెంట్ ఎగ్జామినర్ రోజుకు కనీసం 40 జవాబు పత్రాలు మూల్యాంకనం చేయాల్సి ఉండగా, తొలిరోజున ఒక్కో ఏఈ 20 జవాబు పత్రాల మూల్యాంకనం చేశారు. సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకున్నట్లు, శుక్రవారం నుంచి ఈనెల 10వ తేదీ వరకు రోజూ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిరంతరంగా మూల్యాంకనం జరుగుతుందని డీఈవో వివరించారు. విధుల్లోని ప్రతి ఒక్కరూ ఐడీ కార్డులు తప్పని సరిగా ధరించాలని, సెల్‌ఫోన్లు ఏ ఒక్కరూ వాడరాదని ఆమె హెచ్చరించారు. దీంతోపాటు ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనం సైతం స్థానిక పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఒకేషనల్ భవన్‌లో ప్రారంభమైంది.



మూల్యాంకనానికి హాజరైన సిబ్బంది

# పనులకు వెళుతుండగా ప్రమాదం

**● ట్రాక్టర్ బోల్తా పడి 19 మంది ఉపాధి కూలీలకు గాయాలు**

విజయపురం/నగరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు చేయడానికి ట్రాక్టర్‌లో వెళుతుండగా ముందు చక్రం ఊడిపోవడంతో ట్రాలీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 19 మంది గాయపడ్డారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. విజయపురం మండలం ఆమగుంట గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం కూలీలు పన్నూరు సమీపాన ఉన్న అడవిలో పనులు చేయడానికి ట్రాక్టర్ ట్రాలీలో ఎక్కి బయల్దేరారు. పన్నూరు దళితవాడ సమీపంలో పెళాసపాళెం రోడ్డులోకి వచ్చేసరికి ట్రాక్టర్ ఇంజనుకున్న ముందు చక్రం ప్రమాదవశాత్తూ ఊడిపోయింది. దీంతో ట్రాక్టర్ ట్రాలీ రోడ్డుపక్కన బోల్తాపడింది. అందులో 20 మంది కూలీలు ఉంటే.. 19 మందికి గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా మూడు అంబులెన్సుల్లో బాధితులను నగరి ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేంద్రన్, ఏపీడీ సునీల్‌కుమార్, ఏపీవో ధనయ్య, టీడీపీ నాయకులు వైద్యశాలకు చేరుకున్నారు. బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు.



రోడ్డు పక్కన బోల్తా పడిన ట్రాక్టరు

### గాయపడ్డవారిలో ఇద్దరు తిరుపతికి తరలింపు

గాయపడిన వారిలో శకుంతల(50), కన్నెమ్మ(45), మన్నారు(40), రాజా(32), ధనమ్మ(52), పద్మ(43), లక్ష్మి(54), విమల(32), మునెమ్మ(40), ఉష(38), రాణెమ్మ(55), శివమ్మ(54), శ్యామల(38), జమున(40), సరస్వతి(38), మునికృష్ణయ్య(54), కాంచన(49), కాంతమ్మ(55), అమరమ్మ(55) ఉన్నారు. వీరిలో కాంతమ్మ, అమరమ్మలను మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.మిగిలినవారంతా నగరి ఏరియా వైద్యశాలలోనే చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రులు, వారి బంధువుల రోదనలతో నగరి ఏరియా వైద్యశాల సుమారు గంట సేపు దద్దరిల్లింది. బాధితులకు వైద్యులు జరీనా, మంజుల, కార్తికేయన్, లోకేష్, ప్రవీణ, శ్రీనాథ్, మహేష్, మౌనికలు తమ సిబ్బందితో కలిసి చికిత్స అందించారు.



బాధితురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తదితరులు



బాధితులకు చికిత్స అందిస్తున్న వైద్యులు

## ఎంఎల్ పాయింట్ల తనిఖీలపై ప్రభుత్వానికి నివేదిక

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా వున్న 14 మండల్ లెవల్ స్టాక్ పాయింట్లలో స్టాకు సక్రమంగా ఉందోలేదో బుధవారం అధికారులు పరిశీలించి ఇచ్చిన రిపోర్టులను సమగ్రంగా పరిశీలించి శుక్రవారం ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ బి. బాలకృష్ణ తెలిపారు.ఆర్థిక సంవత్సరాంతం సందర్భంగా ఎంఎల్ పాయింట్లలో ఉన్న స్టాకు రిజిస్టర్‌లో వున్న మేరవుందో లేదో అంటూ తహసీల్దార్లు పౌరసరఫరాల సంస్థ ఆడిట్ బృందం బుధవారం తనిఖీ చేసినట్లు చెప్పారు. గోదాముల్లో నిల్వవున్న బియ్యం, పంచదార, పామోలిన్ ఆయిల్, రాగిపిండి, బెల్లం, గర్భిణీ స్త్రీలకు ఇచ్చే హోంరేషన్ (మూడు కేజీల బియ్యం ప్యాకెట్లు), జొన్నలు, కందిపప్పు వంటి నిత్యావసర వస్తువుల స్టాకు సక్రమంగా ఉందో లేదో తనిఖీ చేశారన్నారు. సివిల్ సప్లై ఆడిట్ ఆఫీసర్ వేణుప్రసాద్ అందించిన రిపోర్టును ప్రభుత్వానికి నివేదిస్తానని ఆయన వివరించారు.

## 78మంది ఎండీయూ వాహన ఆపరేటర్లకు జీతాలు కట్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ నిత్యావసర వస్తువులు అందించాల్సిన ఎండీయూ వాహన ఆపరేటర్లు విధినిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించారన్న ఆరోపణపై 78మందికి మార్చి నెల జీతాలు నిలుపుదల చేస్తూ జిల్లా పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీచేసింది. జిల్లావ్యాప్తంగా 5.36లక్షల రేషన్‌కార్డుదారులకు చిత్తూరు డివిజన్‌లో 167 మంది, పలమనేరు డివిజన్‌లో 169 మంది ఎండీయూ వాహన ఆపరేటర్లు ప్రతినెలా 1-17 తేదీల మధ్య నిత్యావసర వస్తువులు అందజేస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికీ రూ.18వేల జీతం, వారి సహాయకులకు రూ.3 వేల జీతం ప్రభుత్వం చెల్లిస్తోంది. కాగా ఫిబ్రవరి నెలలో కార్డుదారులకు నిత్యావసర వస్తువులు సక్రమంగా అందించని కారణంగా 78మంది ఎండీయూ వాహనాల ఆపరేటర్ల జీతాలను ఈ నెల ప్రారంభంలో నిలిపివేస్తూ డీఎస్వో కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఎస్వో శంకరన్ తెలిపారు.

# ఎస్పీ ఆదేశాలు బేఖాతర్

**● బదిలీ ప్రాంతాల్లో చేరని పోలీసులు**

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ మణికంఠ ఆదేశాలను పోలీసులు బేఖాతరు చేస్తున్నారు. పుంగనూరు మండలం కృష్ణాపురంలో టీడీపీ కార్యకర్త రామకృష్ణ హత్య నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా 264 మంది పోలీసులను బదిలీ చేస్తూ ఎస్పీ పది రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేశారు.వెంటనే బదిలీ చేసిన స్థానాల్లో చేరాలని ఆదేశాలిచ్చారు. అయితే దాదాపు 70 శాతం మంది పోలీసులు ఇంకా బదిలీ చేసిన స్థానాల్లో చేరలేదు. క్రమశిక్షణకు మారుపేరుగా ఉన్న పోలీసుశాఖలో ఇలా జరగడం చర్చనీయాంశంగా మారింది. బదిలీ అయిన వారిలో కొంత మంది పోలీసులు ఆరోగ్యకుటుంబ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. మరికొంత మంది పదవీ విరమణకు దగ్గరలో ఉన్నారు. ఈ నేపథ్యంలో బదిలీలపై ఎస్పీ పునరాలోచించాలని పోలీసులు మొదట్లో విజ్ఞప్తి చేశారు. అయితే అందుకు ఎస్పీ మణికంఠ ససేమిరా అన్నట్లు సమాచారం. పుంగనూరు ప్రాంతంలో మాత్రం గంగజాతర నేపథ్యంలో అక్కడ పనిచేసే సిబ్బందికి కొన్ని సడలింపులు ఇచ్చారు. జాతర ముగిసిన తరువాత వారు కూడా బదిలీ స్థానాల్లో చేరాలని ఆదేశించారు. పుంగనూరే కాకుండా జిల్లా వ్యాప్తంగా బదిలీ అయిన పోలీసుల్లో సుమారు 50 మంది మాత్రమే కొత్త స్థానాల్లో చేరినట్లు సమాచారం. మిగిలిన వారు మునుపటి స్టేషన్లలోనే కొనసాగుతుండడం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**కౌన్సెలింగ్ ద్వారా జరిగివుంటే :** గతంలో పోలీసుశాఖలో బదిలీలను కౌన్సెలింగ్ ద్వారా నిర్వహించేవారు.ఇలా చేయడం వల్ల పోలీసులు తమకు అనుకూలంగా ఉన్న స్టేషన్లను ఎంపిక చేసుకునే అవకాశం ఉండేది. అయితే పుంగనూరు ఘటన నేపథ్యంలో ఎస్పీ ఈ నిబంధన పాటించలేదు. రాజకీయ నేతల విమర్శల నేపథ్యంలో ఎస్పీ రాత్రికి రాత్రే కానిస్టేబుళ్లను, కొంత మంది ఎస్ఐలను బదిలీ చేశారు. వీరిలో ఎస్ఐలు మాత్రం బదిలీ చేసిన స్థానాలకు వెళ్లారు. పోలీసులు మాత్రం చాలా మంది అలాగే ఉన్నారు. కౌన్సెలింగ్ నిబంధన ఇక్కడ కూడా పాటించి ఉంటే కానిస్టేబుళ్లు కూడా బదిలీ అయిన స్థానాలకు వెళ్లేవారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



## తల్లిని తిట్టాడని తండ్రిపై దాడి

**● మృతిచెందిన పాపిరెడ్డిపల్లెవాసి**

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కొడుకు చేతిలో తండ్రి హతమైన సంఘటన శ్రీరంగరాజపురం మండలం పాపిరెడ్డిపల్లెలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాపిరెడ్డిపల్లెకు చెందిన శ్రీనివాసులు మందడి(60) మద్యానికి బానిసై భార్య జ్యోతితో రోజూ గొడవపడేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం మద్యం మత్తులో భార్యతో గొడవ పడటంతో అక్కడే ఉన్న కుమారుడు నాగరాజు దాన్ని తట్టుకోలేక ఇటుక రాయితో తండ్రిపై దాడి చేశాడు. దీంతో శ్రీనివాసులు మందడి తలకు తీవ్రగాయమై మృతి చెందినట్లు అతడి అన్న సుబ్రహ్మణ్యం మందడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ హనుమంతప్ప, ఎస్ఐ సుమన్ తమ సిబ్బందితో కలిసి గురువారం సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



మృతి చెందిన శ్రీనివాసులు

## 1.5 కిలోల గంజాయి స్వాధీనం: ముగ్గురి అరెస్టు

ఐరాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలం గుండ్లపల్లె వద్ద గురువారం 1.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని.. ముగ్గురిని అరెస్టు చేశారు. ఎస్ఐ నరసింహాలు తెలిపిన వివరాల మేరకు.. గుండ్లపల్లె బస్టాప్ వద్ద గంజాయి అమ్ముతున్నారని సమాచారంతో పోలీసులు దాడి చేశారు. గుండ్లపల్లె ఎస్టీ కాలనీకి చెందిన ఆర్.మంగమ్మ, మైథిలి, రామకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 1.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను చిత్తూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు. గంజాయి రవాణా, విక్రయాలపై సమాచారం తెలిస్తే 9440796722 నెంబరుకు ఫోన్ చేయాలని ప్రజలకు ఎస్ఐ సూచించారు.



ఐరాల పోలీస్‌స్టేషన్‌లో నిందితులు




తిరుమలలో టీటీడీ అధికారులు నివాసముండే బీటైప్ క్వార్టర్స్ వద్ద గురువారం ఆరు అడుగుల నాగుపాము పట్టుబడింది. 60వ నెంబరు గదికి సమీపంలో పాము కనిపించడంతో భాస్కరనాయుడుకు సమాచారం ఇచ్చారు. వెంకటనే అక్కడికి చేరుకున్న ఆయన పామును పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



భక్తుడికి తిరిగి బంగారు గొలుసు అందజేస్తున్న అధికారులు

## మరచిపోయిన బంగారు గొలుసు తిరిగి అప్పగింత

కాటేజీ గదిలో మర్చిపోయిన బంగారు గొలుసును టీటీడీ అధికారులు భక్తులకు తిరిగి అప్పగించారు.నెల్లూరుకు చెందిన సురేష్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం తిరుమలకు వచ్చి సన్నిధానం అతిథిగృహంలో దిగారు. దర్శనం అనంతరం గురువారం గది ఖాళీ చేసే సమయంలో 40 గ్రాముల బంగారు గొలుసును మర్చిపోయి వెళ్లిపోయారు. ఆతర్వాత గుర్తించిన సిబ్బంది దానిని అధికారులకు అందజేశారు. వివరాలు సేకరించిన అనంతరం సూపరిటెండెంట్ భాస్కర్‌నాయుడు, మేనేజర్ కామేశ్వరరావు, సబార్డినెంట్ చంద్రశేఖర్ విజిలెన్స్ ఆధ్వర్యంలో భక్తులకు గొలుసు అప్పగించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## ఇబ్బంది పెట్టే నైజం నాది కాదు

● నమ్మకద్రోహం మానుకోండన్న ఎమ్మెల్యే ఆదిమూలం




వరదయ్యపాళెం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): 'ఇబ్బంది పెట్టే నైజం నాది కాదు. అందరినీ కలుపుకొని పోయే మనస్తత్వం. కొంత మంది నాయకులు నమ్మకద్రోహం మానుకోవాలి'అని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. తనను గత ఎన్నికల్లో ఓడించాలని కొంత మంది టీడీపీ నాయకులు ప్రత్యర్థి పార్టీతో చేతులు కలిపినా తాను వారిని విమర్శించలేదన్నారు. తాను వైసీపీ నాయకులకు పనులు చేయడం, మాట్లాడటం చేయలేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక సుమారు రూ.20కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కూటమి నాయకులను కాదని ఏ పనైనా తాను చేసుంటే నిరూపించాలని సవాల్ విసిరారు. ఊపిరి ఉన్నంత వరకు పార్టీకి విధేయుడిగానే ఉంటామన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి కోసం ప్రజలు తనను నేరుగా కలిస్తే పనిచేయిస్తామన్నారు. ఎవరినో నమ్మి డబ్బులు పోగొట్టుకోవద్దని సూచించారు. పార్టీలో కష్టపడ్డవారికే నామినేటెడ్ పదవులు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, నాయకులు నందకిషోర్ రెడ్డి, జయశంకర్‌రెడ్డి, నిర్మల్, మురళి నాయుడు పాల్గొన్నారు.

## సంగీత స్వరాల్లో వేదాలు

● అదే నా చివరి కోరిక

'స్వామి వైభవాన్ని తెలిపేలా అనేక అన్నమయ్య కీర్తనలు చేసిన నేను ఓ మహా యజ్ఞ కార్యక్రమానికి పూనుకున్నా. నాలుగు వేదాలను సంగీత రూపంలో తీసుకురావాలనుకుంటున్నాను. ఇదే నీ చివరి కోరిక కూడా' అని ప్రముఖ సంగీత దర్శకుడు కోటి అన్నారు. తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఇంతవరకు ఎవ్వరూ చేయని కార్యానికి తాను సంకల్పించానని చెప్పారు. ఇది ఎన్నేళ్లకు పూర్తవుతుందో కూడా తెలీదని, దేవుడు, అభిమానుల ఆశీస్సులతో పూర్తి అవుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ విజయవంతం కావాలని కోరుకునేందుకు తిరుమలకు వచ్చినట్టు తెలిపారు. ఇటీవల వాసవి కన్యాకపరమేశ్వరిపై 'వాసవి సాక్షాత్కారం' అనే ఆల్బమ్ చేయగా మంచి ఆదరణ లభించిందన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఆలయం ముందు సంగీత దర్శకుడు కోటి

## నేడు మంత్రి నాదెండ్ల పర్యటన

వడమాలపేట/తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారని జేసీ శుభం బన్సల్ గురువారం తెలిపారు. వడమాలపేట మండలం తిరుమణ్యం రైతు సేవా కేంద్రం పరిధిలోని ఎనమలపాలెంలో ధాన్యం కొలుగోలు కేంద్రాన్ని మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభించి, రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. దీంతో రైతు సేవా కేంద్రాన్ని ఆర్డీవో రామ్మోహన్, జిల్లా సివిల్ సప్లై అధికారి సుమతి, తహసీల్దార్ జరీనా, వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ గురువారం పరిశీలించారు. సాయంత్రం 5గంటలకు తిరుపతి నగరం కెనడీ నగర్‌లో సిలిండర్ పంపిణీ చేసి తిరుమల వెళ్లనున్నారు.

## సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమలలో సర్వదర్శనం కోసం భక్తులు దాదాపు 12 గంటల పాటు వేచి ఉండక తప్పదు. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.




మంగళవారం హుండీ ఆదాయం: రూ.4 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,721

తలనీలాలు సమర్పించినవారు: 25,545



■ నేడు పదవ వార్షికోత్సవం



# 'దశ'దిశలా విద్యా సౌరభాలు

## బోధన,పరిశోధనల్లో అగ్రపథాన తిరుపతి ఐఐటీ

**తిరుపతి ఐఐటీ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ టెక్నాలజీ) పదేళ్లు పూర్తి చేసుకుంది. బాలారిష్టాలను అధిగమించి సగర్వంగా తలెత్తుకునే స్థితికి చేరింది. దేశంలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థల సరసన చోటు సంపాదించింది. ఏటా నిపుణులైన ఇంజనీర్లను అందిస్తూ సాంకేతిక ప్రగతిలో పాలుపంచుకుంటోంది. ఆరంభంలో తాత్కాలిక భవనాల్లో అవస్థలు పడినా నేడు విశాలమైన క్యాంపస్‌గా రూపుదిద్దుకుంది. ఎన్నో ఆవిష్కరణలు,పరిశోధనలతో అగ్రగామిగా దూసుకువెళ్తోంది. నేడు పదో వార్షికోత్సవ సందర్భంగా ఈ విద్యా సంస్థ ప్రస్థానాన్ని పరికిస్తే..**

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

రాష్ట్ర విభజనలో భాగంగా 2015 కేంద్ర ప్రభుత్వం తిరుపతిలో ఐఐటీ ఏర్పాటు చేసింది. ఆరంభంలో చదలవాడ విద్యాసంస్థల ప్రాంగణంలోని తాత్కాలిక భవనంలో తరగతులను ప్రారంభించింది. నాడు సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ జాతీయ విద్యాసంస్థకు ఏర్పేడు మండలం మేర్లపాకలో 560 ఎకరాలను కేటాయించారు. దీనివిలువ సుమారు వెయ్యి కోట్లరూపాయలపైనే ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వమే రూ.12 కోట్లతో భూమి చుట్టూ ప్రహరీని ప్రభుత్వం నిర్మించింది. ఐఐటీ సొంత గూటికి టీడీపీ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించింది. 106 మంది విద్యార్థులతో ఐఐటీ విద్యా ప్రస్థానాన్ని మొదలుపెట్టింది. ఏడేళ్ల తర్వాత(2022 ఆగస్టు 1న) మేర్లపాక వద్ద సువిశాల ప్రాంగణంలోకి ఈ విద్యా సంస్థ అడుగుపెట్టింది. గడచిన పదేళ్లగా అధికారయంత్రాంగం,బోధనాసిబ్బంది అవిరళ కృషి ఫలితంగా అంచెలంచెలుగా విద్యాసంస్థ ముందంజ వేయగలిగింది. అత్యాధునిక ప్రయోగశాలలు, హాస్టల్ భవనాలు, తరగతి గదులు, క్రీడా సౌకర్యాలను సమకూర్చుకుంది. మద్రాస్ ఐఐటీ పర్యవేక్షణలో స్వయంప్రతిపత్తి హోదాతో ఇక్కడ బోధన, పరిశోధన నిర్విరామంగా సాగుతోంది. ఇప్పటివరకూ ఆరు బ్యాచుల్లో 2వేల మందికిపైగా ఐఐటీయన్లను జాతికి అందించింది.

### ప్రధాన కోర్సులివే..

ఏటా బీటెక్‌కు సంబంధించి ఐదు విభాగాల్లో 244 మంది విద్యార్థులకు ప్రవేశాలను పొందుతున్నారు. కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ బ్రాంచులతోపాటు ఎంటెక్, ఎంఎస్(పరిశోధన ద్వారా), ఎమ్మెస్సీ, మాస్టర్ ఆఫ్ పబ్లిక్ పాలసీ(ఎంపీపీ), పీహెచ్‌డీ సహా అనేక పీజీ ప్రోగ్రాంలను తిరుపతి ఐఐటీ అందిస్తోంది. ప్రస్తుతం 1667 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు.

**అకడమిక్ మైలురాళ్లు :** ఇక్కడి ఐఐటీలో విభిన్న నైపుణ్యం కలిగిన 139 మందికి పైగా అధ్యాపకులున్నారు. దాదాపు 1266 ప్రచురణలకు సమర్పించారు. 203వరకు ప్రాయోజిత పరిశోధన ప్రాజెక్టులు, 209 ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీల ప్రాజెక్టులను చేపట్టారు. ఇప్పటివరకు 25 పేటెంట్లను దాఖలు చేశారు. పలు సంస్థల నుంచి ఎంవోయూలను చేసుకున్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)- 2022లో మొదటి భాగస్వామ్యంలో ఈ ఐఐటీ ఇంజనీరింగ్ విభాగం 56వ ర్యాంకు పొందింది. ఇది అకడమిక్ ఎక్సలెన్స్‌లో సాధించిన విజయానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

### రీసెర్చ్ క్యాంపస్

క్యాంపస్‌లో పదెకరాల విస్తీర్ణంలో విస్తరించిన రెండు సరస్సులు ఉన్నాయి. నీటి నిర్వహణ వ్యవస్థలో 600 కెఎల్డీ నీటి శుద్ధి విభాగం, రెండు మురుగునీటి శుద్ధి యూనిట్లు, రీసైకిల్ చేసిన నీటిని ఉపయోగించే మైక్రో ఇమేజింగ్ వ్యవస్థ ఏర్పాటయ్యాయి. రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్, శీతలీకరణ వ్యవస్థ, అగ్నిమాపక భద్రతా వ్యవస్థలను సమకూర్చుకుంది. పచ్చదనం పరుచుకున్న ఇక్కడి వాతావరణం ఆహ్లాదం పంచుతుంది. 5,250 చెట్లు, 110,000 పూల మొక్కలు, 260 ఔషధ మొక్కలు, జీవవైవిధ్యతోటలు స్వాగతం పలుకుతాయి.

### ఎంవోయూలతో ముందడుగు

సహకార పరిశోధన, విద్యాపరమైన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి తిరుపతి ఐఐటీ దాదాపు 50 విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలతో వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటుచేసుకుని ముందడుగు వేస్తోంది. యూఎస్ఏ, నార్వే, కెనడా వంటి అంతర్జాతీయ సంస్థలతో పాటు ఇండియన్ నేవీ, ఎన్‌హెచ్ఏఐ, సీఎస్ఐఆర్ ఎస్ఈఆర్ఎల్, ఇండియన్ నావల్ అకాడమీ, హిందూస్తాన్ షిప్‌యార్డ్ సంస్థలో ఎంవోయూ చేసుకుంది. పీహెచ్‌డీ ప్రోగ్రాంపై నార్వే యూనివర్సిటీతో ఇటీవల ఒప్పందం కుదుర్చుకుంది.

### విద్యార్థి విజయాలు

- రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ నిర్వహించిన గ్లోబల్ ఆన్‌లైన్ పోస్టర్ సదస్సులో సివిల్ అండ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన పీహెచ్‌డీ స్కాలర్ ఎంఎస్వీ నాగజ్యోతి రెండవస్థానంలో నిలిచారు.
- టూ మ్యూనిచ్‌లో పరిశోధనకు కెమికల్ ఇంజనీరింగ్ పీజీ విద్యార్థి ఆదిత్యన్ డాడ్ కోస్‌పీ స్కాలర్‌షిప్‌ను అందుకున్నారు.
- పరిశోధక విద్యార్థులు విరిత్, ప్రశాంత్ ఆర్‌డబ్లుటీహెచ్ వర్సిటీలో డాడ్ ద్విజాతీయ డాక్టోరల్ స్కాలర్‌షిప్‌లను పొందారు
- బీటెక్ విద్యార్థి చిరాగ్ కోటియన్ టొరొంటో వర్సిటీ మిటాక్స్ ఇంటర్న్‌షిప్‌ను పొందారు.



### అధ్యాపకుల అవార్డులు

- అంతర్జాతీయ ఇంజనీరింగ్, ఆహార సంఘంచే ప్రొఫెసర్ కెఎస్ఎంఎస్ రాఘవరావు ప్రతిష్టాత్మకమైన లైఫ్‌టైం ఎచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు.
- డాక్టర్ అజయ్‌కుమార్ చంద్రమీనన్ ప్రతిభ అవార్డు అందుకున్నారు
- ప్రొఫెసర్ కృష్ణ ప్రపూర్ణ యూఎస్ఎన్ఏఈలో అంతర్జాతీయ సభ్యులుగా నియమితులయ్యారు.






### కేంద్ర నిధులతో మౌలిక వసతులు

అంకిత భావంతో పనిచేసే సిబ్బంది, విద్యార్థుల పట్టుదల, ప్రాజెక్టులకు మద్దతు ఇచ్చే పరిశ్రమల సహకారం ఐఐటీ అభివృద్ధి వెనుక ఉన్నాయి.. కేంద్ర ప్రభుత్వం ఉదారంగా నిధులు ఇవ్వడంతో మౌలిక సదుపాయాల కల్పన సాధ్యమైంది. ప్రారంభం నుంచి మద్రాస్ ఐఐటీ మార్గదర్శకత్వం వహిస్తోంది. శుక్రవారం పదో వార్షికోత్సవంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.



- ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ, డైరెక్టర్, ఐఐటీ-తిరుపతి



## శ్రీసిటీలో రష్యన్ ఫెడరల్ కాన్సుల్ జనరల్


● పెట్టుబడి అవకాశాలపై పరిశీలన

సత్యవేడు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): చెన్నైలోని రష్యన్ ఫెడరేషన్ కాన్సుల్ జనరల్ వాలెరీ ఖోడ్‌జేవ్ గురువారం శ్రీసిటీని సందర్శించారు. ఇండో రష్యన్ వాణిజ్య సంబంధాలు మరింత బలపడేందుకు, వ్యాపార సహకారాన్ని పెంపొందించడంలో ఈ పర్యటన అత్యంత కీలకమైనదిగా శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పటికే రష్యన్ సంస్థ కుయిబిషెన్ అజోట్ పరిశ్రమ ఇక్కడ ఏర్పాటైనట్లు గుర్తు చేశారు. మరిన్ని రష్యన్ పరిశ్రమలు శ్రీసిటీని ఎంచుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీసిటీలోని మౌలిక సదుపాయాలు, వ్యాపారానుకూలత వాతావరణం, వేగవంతమైన అభివృద్ధి తదితర అంశాలపై కాన్సుల్ జనరల్ బృందానికి శ్రీసిటీ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శివశంకరన్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. శ్రీసిటీకి ఉన్న బహుళ ప్రయోజనాల దృష్ట్యా, విభిన్న తయారీ రంగాలకు చెందిన మరిన్ని రష్యన్ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని వాలెరీ ఖోడ్‌జేవ్ తెలిపారు. శ్రీసిటీ పరిసరాలతో పాటు కుయిబిషెన్ అజోట్ పరిశ్రమను సందర్శించిన ఆయన.. అనంతరం సిద్ధార్థ లాజిస్టిక్స్ పరిశ్రమ ఎండీ నిశ్చల్ పాధ్యాతో చర్చలు జరిపారు.



శ్రీసిటీ ప్రతినిధులతో కాన్సుల్ జనరల్ సమావేశం

## వైభవంగా కోదండరాముడి రథోత్సవం



అశ్వ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

● నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం రథోత్సవం వైభవంగా సాగింది. ఉదయం 9.15 గంటలకు సీతాలక్ష్మణ సమేత కోదండరాముడు రథాన్ని అధిష్ఠించి నాలుగు మాడవీధుల్లో విహరించారు. జైశ్రీరామ్ అని నినదిస్తూ భక్తులు రథాన్ని లాగారు. పలు సంఘాలు, భక్తులు మజ్జిగ, పానీయాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తిరుమంజనం, ఆస్థానం చేపట్టారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు అశ్వ వాహనంపై స్వామివారు ఊరేగారు. తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

### నేడు చక్రస్నానం

శుక్రవారం ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఉదయం 9 నుంచి 10.30గంటల వరకు కపిలతీర్థంలో చక్రస్నానం నిర్వహిస్తారు.

## నేటి నుంచి శ్రీరామనవమి ప్రత్యేక ప్యాకేజీ టూర్

తిరుపతి అర్బన్/శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం నుంచి 11వ తేది వరకు ప్రత్యేక ప్యాకేజీ టూర్ ఏర్పాటు చేసినట్లు ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ సి.హెచ్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోజూ ఉదయం 8గంటలకు విష్ణునివాసం, శ్రీనివాసం నుంచి హైటెక్ నాన్ ఏసీ బస్సు ఒంటిమిట్ట, దేవునికడప, తాళ్లపాక, నందలూరు మళ్లీ తిరుపతికి చేరుకుంటుందని తెలిపారు. రూ.700 ప్రయాణ చార్జీగా నిర్ణయించామని, మరిన్ని వివరాలకు 08772289123, 9848007033లను సంప్రదించాలని కోరారు.

# కాణిపాక ఆలయ చైర్మన్ పదవి ఎవరికో?

### పోటీలో నలుగురు నేతలు



కాణిపాక వరసిద్ధుడి ఆలయం

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో అని స్థానికుల్లో ఉత్కంఠ నెలకొంది. ఆలయానికి ధర్మకర్తల మండలి సుమారుగా 11నెలలుగా లేదు.బొమ్మసముద్రానికి చెందిన మణినాయుడు (సురేంద్ర నాయుడు), మాజీ జడ్పీటీసీ ముళ్లగూరి లత బాబునాయుడు, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదనరావు, స్థానిక టీడీపీ నేత పూర్ణచంద్ర వరసిద్ధుడి ఆలయ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. ఆలయ కీర్తి ప్రతిష్టలు పెంచేవారికే చైర్మన్ పదవి కట్టబెట్టాలని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ భావిస్తున్నట్లు సమాచారం.పదవిని ఆశిస్తున్న వారి పేర్లు ఇప్పటికే సీఎం వద్దకు చేరినట్లు తెలుస్తోంది. గతంలో ధర్మకర్తల మండలిలో పనిచేసినవారు తిరిగి సభ్యులు కావాలని ఆశపడుతున్నారు. దీనిపై మరో మూడ్రోజుల్లో ప్రకటన వెలువడనుందని సమాచారం.

## హెల్త్ ప్రోగ్రామ్‌ల పర్యవేక్షణకు అధికారుల నియామకం

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో వివిధ హెల్త్ ప్రోగ్రామ్‌లను పర్యవేక్షించేందుకు డివిజన్ ఒక్కో అధికారిని నియమిస్తూ గురువారం డీఎంహెచ్‌వో సుధారాణి ఉత్తర్వులు జారీ చేశారు. జీడీనెల్లూరు డివిజన్‌కు డీఐవో హనుమంతరావు, పలమనేరుకు టీబీ అధికారి వెంకటప్రసాద్, కుప్పానికి గంగాదేవి, చిత్తూరుకు అనుషా, నగరికి నవీన్ తేజ్, పూతలపట్టుకు గిరి, పుంగనూరుకు అనిల్ కుమార్‌ను నియమించారు. వీరు ఆయా డివిజన్ల అన్ని హెల్త్ కార్యక్రమాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది.

## రేపు చిత్తూరులో 'జేఈఈ'పై సదస్సు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలో తొలిసారిగా నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం హోటల్ భాస్కరలో జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు డీజీఎం కొండలరావు, కోర్ డీన్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెస్ట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరు కావచ్చన్నారు. వివరాలకు 99590 55316, 73373 36483 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

## కరకంఠేశ్వరాలయంలో పంగుణి ఉత్సవాలు ప్రారంభం



సూర్యప్రభ వాహనంపై కామాక్షి సమేత కరకంఠేశ్వరస్వామి

నగరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలోని కామాక్షి సమేత కరకంఠేశ్వరస్వామి ఆలయంలో గురువారం ధ్వజారోహణంతో పంగుణి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం హోమపూజలు చేసి మూలవర్లకు అభిషేకం నిర్వహించారు. ఉత్సవమూర్తులను సాయంత్రం ఆరు గంటలకు సూర్యప్రభ వాహనంపై అధిష్ఠింపజేసి, పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు దర్శించుకుని కర్పూర హారతులు పట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలను కమిటీ సభ్యులు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## కంటైనర్, లారీ ఢీ: ఇద్దరికి తీవ్రగాయాలు



ముందు భాగం ధ్వంసమైన వాహనాలు

గుడిపాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కంటైనర్, లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు నుంచి వేలూరు వైపు వస్తున్న నువ్వుల లారీ, చెన్నై నుంచి అనంతపురానికి వెళ్తున్న కంటైనర్ మార్గమధ్యమైన 190 రామాపురం సీఎంసీ వద్ద గురువారం ఉదయం ఎదురెదురుగా ఢీకొన్నాయి. నువ్వుల లారీలోని డ్రైవర్, సహాయకుడికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, ఈ ప్రమాదంపై చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ తన పీఏలు కుమారస్వామి, మోహన్‌లను సంఘటనా స్థలానికి పంపి పరిస్థితిపై ఆరాతీశారు. సహాయక చర్యలను చూసుకోవాలని వారికి ఎమ్మెల్యే సూచించారు.

## వక్ఫ్ కమిటీల్లో ముస్లింలకే స్థానం: టీడీపీ



సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వక్ఫ్ కమిటీల్లో ముస్లింలకే స్థానం ఉంటుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ తెలిపారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ముస్లింలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లడానికి టీడీపీ కృషిచేస్తోందని చెప్పారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో ముస్లింలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ముస్లింల ప్రయోజనాలను కాపాడడంకోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని స్పష్టం చేశారు.

## ఎట్టకేలకు కులందేశ్వరాలయ భూముల గుర్తింపు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని ఎంతో విశిష్టత కలిగిన కట్టమంచి కులందేశ్వర ఆలయంలో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై తిరుపతి ఎండోమెంట్ ఆర్జేసీ కార్యాలయ అధికారుల చర్యలకు ఉపక్రమించారు. అందులో భాగంగా గురువారం ఆలయ భూముల గుర్తింపు కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు అసిస్టెంట్ కమిషనరు చిట్టెమ్మ ఆదేశాలతో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నగరంలోని తిమ్మసముద్రం, కట్టమంచి లాయర్స్ కాలనీ, కొంగారెడ్డిపల్లె వెంగళ్రావు కాలని, కట్టమంచి కులందేశ్వర ఆలయం, కార్వేటి నగరం, శ్రీరంగరాజపురం పుల్లూరుక్రాస్ తదితర ప్రాంతాల్లో అన్యాక్రాంతమైన భూములపై నివేదికను అందజేశారు. వీటితోపాటు ఆలయంలో కమిషనరు అనుమతి లేకుండా అర్చకులు, ఈవోలు అనధికారికంగా చేపట్టిన ప్రహరీ నిర్మాణ పనులను కూడా నివేదికలో పొందుపర్చారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా దేవదాయశాఖ కార్యాలయ అధికారులు తెలిపారు.

## నెమళ్ల స్వైరవిహారం.. వరిపంటలకు నష్టం

సోమల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని పలు గ్రామాల అటవీ శివారుల్లోని పంట పొలాల్లో నెమళ్ల సంచారంతో పంటను కోల్పోతున్నామని బాధితులు వాపోతున్నారు. సోమల-కందూరు మార్గం బంగారు తిరుత్తణి కొండ సమీపంలోని వల్లూరి నాగరాజ వరి పొలంలో మంగళవారం రాత్రి పదుల సంఖ్యలో నెమళ్లు సంచరించి వరి పంటకు నష్టం కలిగించాయని తెలిపారు. అలాగే గంగాధరం, పురుషోత్తం వేరుశనగ పొలంలోనూ సంచరించి పంట నష్టం చేశాయి. పగలు కోతులు, నెమళ్లు, రాత్రి అడవిపందుల సంచారంతో ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పొలాల వద్ద జాగారం చేస్తున్నా ఏదో ఒక సమయంలో పంటలపై దాడులు చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

# ముందస్తు చర్యలతో తాగునీటి ఎద్దడి నివారణ

### ● కలెక్టర్ సుమిత్ కుమార్



కుప్పం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేసవి ఉష్ణోగ్రతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ముంచుకొస్తున్న తాగునీటి ఎద్దడిని ముందస్తు చర్యలతో నివారించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కుప్పంలోని కడా కార్యాలయంలో గురువారం ఆయన నియోజకవర్గంలో తాగునీటి సమస్యపై కడా పీడీ వికాస్ మర్మత్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవికి ముందే తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని గతంలోనే అధికారులకు సూచించిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లాలో మరీ ముఖ్యంగా కుప్పం నియోజకవర్గంలో భూగర్భ జలాల మట్టం ప్రమాదకర స్థాయిలో తగ్గుతున్న విషయం ఆందోళన కలిగిస్తుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు క్షేత్ర స్థాయిలో పంచాయతీ సెక్రటరీలు, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయంలో అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. పంచాయతీ నిధులను తాగునీటి సమస్య పరిష్కారానికి వినియోగించుకోవాలని, అందుకు సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాలని చెప్పారు. సమస్య ఉన్నచోట్ల ఇప్పటికే ఉన్న తాగునీటి బోర్లను మరింత లోతు చేయడం, కొత్త బోర్లు వేయడం వంటి చర్యలు తీసుకోవాలన్నారు. అయితే కొన్నిచోట్ల బోర్లు వేసినా విద్యుత్తు కనెక్షన్లు లేకపోవడంతో తాగునీటిని సరఫరా చేయలేకపోతున్నట్లు అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన కలెక్టర్ సుమిత్ కుమార్ రెస్కో అధికారులతో మాట్లాడారు. తాగునీటి బోర్ల విషయంలో ఎప్పటికప్పుడు విద్యుత్తు కనెక్షన్ ఇచ్చి తాగునీటి ఎద్దడి నివారణకు కృషి చేయాలని వారిని ఆదేశించారు.

### హంద్రీ-నీవాను చెరువులకు అనుసధానం చేయండి

హంద్రీ-నీవా కాలువను చెరువులకు అనుసంధానం చేసే ప్రక్రియకు అవసరమైన పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మొదటి విడతలో 55 చెరువులను అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని 11 ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం దీనికి నిధులు విడుదల చేసిందన్నారు. నరేగా కింద పాఠశాలల్లో ఆటస్థలం, ప్రహరీల నిర్మాణానికి 60 పాఠశాలలను ఎంపిక చేసినట్లు చెప్పారు.సంబంధిత ప్రతిపాదనలు ఈనెల 30 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పురుషోత్తం, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, నాలుగు మండలాల ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి

### మహిళలకు ఎస్పీ మణికంఠ సూచన



కార్వేటినగరం పోలీసుస్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ మణికంఠ

వెదురుకుప్పం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎస్పీ మణికంఠ సూచించారు. గురువారం కార్వేటినగరం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు, స్మార్ట్‌లాక్‌లను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. క్రైం రికార్డులను పరిశీలించారు. ఎన్‌డీపీఎల్, పీడీఎస్ రైస్ వంటి అక్రమ రవాణాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని ఆదేశించారు. మహిళా పోలీసుల ద్వారా విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించి గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మైనర్లపై జరిగే అఘాయిత్యాలు, అనర్థాలను తెలియజేయాలన్నారు. తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి, నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్ కేసులను పరిశీలించి, నిందితులు త్వరగా అరెస్టు చేయాలని చెప్పారు. సివిల్, భూతగాదాలు, పాత గొడవలు, సారా అమ్ముతున్నారని అనుమానంగా ఉన్న వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలని సూచించారు. నగరి డీఎస్పీ సయ్యద్ మోహమ్మద్ అజీజ్, కార్వేటినగరం ఎస్‌ఐ పి.రాజ్‌కుమార్ ఉన్నారు.

# అలరించిన దుర్యోధన వధ



పులిచెర్లలో దుర్యోధన వధ ఘట్టం సన్నివేశం

కల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండల కేంద్రంలో 18 రోజులుగా కొనసాగిన మహాభారత యజ్ఞంలో భాగంగా చివరిరోజు గురువారం దుర్యోధన వధ ఘట్టం అందరినీ అలరించింది. ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో ఉదయం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో బంకమట్టితో దుర్యోధనుడి బొమ్మను రూపొందించి పూజలు చేపట్టారు. దుర్యోధనుడిని మడుగు నుంచి బయటకు రప్పించే సన్నివేశం ఆకట్టుకుంది. దుర్యోధనుడు, భీమసేనుడి మధ్య యుద్ధ సన్నివేశాలు, పద్యాలు, పాటలు రక్తి కట్టించాయి. భీమసేనుడు దుర్యోధనుడి తొడపై గదతో కొట్టి వధించి అతని రక్తాన్ని ద్రౌపదిదేవి కురులకు పూసే సన్నివేశాలకు పాత్రధారులు జీవంపోశారు. అనంతరం కళాకారులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఉభయదారులుగా చిన్నబెస్తపల్లికి చెందిన యర్రయ్య కుటుంబసభ్యులు వ్యవహరించారు.

# ముక్కంటి సేవలో పూజాహెగ్డే



సర్పదోష నివారణ పూజల్లో పూజా హెగ్డే - పూజా హెగ్డేని చుట్టుముట్టిన ఆలయ సిబ్బంది

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం ప్రముఖ సినీ నటి పూజాహెగ్డే కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆమె ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆమెను ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయాధికారులు హరియాదవ్, రవి తదితరులు పాల్గొన్నారు.

### ప్రముఖులను కమ్మేస్తున్న సిబ్బంది

శ్రీకాళహస్తీశ్వరాలయంలో పనిచేసే కొంద రు సిబ్బంది అత్యుత్సాహంతో కొందరు ప్రముఖులను కమ్మేస్తున్నారు. వారికి చిరాకు తెప్పిస్తున్నారు. విధులు నిర్వర్తించాల్సిన పాయింట్లను వదలి సెల్ఫీల కోసం వెంటపడుతున్నారు. దీంతో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇలా గురువారం సినీ నటి పూజాహెగ్డే దర్శనానంతరం కంచు గడప వద్దకు రాగా.. ఆలయ సిబ్బంది చుట్టుముట్టడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

# విద్యుదాఘాతంతో బాలుడి మృతి



మృతిచెందిన గజముఖన్ (ఫైల్ ఫొటో)

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ బాలుడు మృతి చెందిన సంఘటన గురువారం పుంగనూరు మండలంలో జరిగింది. వివరాలు ఇలా... మండలంలోని సింగిరిగుంట పంచాయతీ అరవపల్లెకు చెందిన రత్నకుమార్ కుమారుడు గజముఖన్ (4) గ్రామంలోని గుడి వద్ద పిల్లలతో కలిసి ఆటలాడుతుండగా ఇనుప రేకులకు వేసిన రాడ్డును పట్టుకున్నాడు. ఇనుప రాడ్డుకు విద్యుత్తు సరఫరా కావడంతో బాలుడు గజముఖన్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

# రాయితీలపై హోటల్స్ అసోసియేషన్ హర్షం

### ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్రాభివృద్ధికి ఊతం

గుణదల(విజయవాడ), ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): హోటల్ రంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబు రాయితీలు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.స్వామి తెలిపారు. విజయవాడలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏటా రూ.66 లక్షలు ఎక్సైజ్ సుంకం చెల్లిస్తున్నామని దానికి తగ్గట్లుగా హోటల్ వ్యాపారాలు ఉండకపోవడంతో నష్టం వస్తోందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన గురువారం అమరావతిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో.. స్టార్ హోటల్స్ చెల్లిస్తున్న ఎక్సైజ్ సుంకాన్ని రూ.66 లక్షల నుంచి రూ.25 లక్షలకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. హోటల్ రంగానికి మరిన్ని రాయితీలు ఇస్తుండటంతో ఏపీలో స్టార్ హోటల్స్ ఏర్పాటు చేసేందుకు పెట్టుబడిదారులు ముందుకు వస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 54 స్టార్ హోటల్స్ ఉన్నాయని, ప్రభుత్వ ప్రోత్సాహంతో మరిన్ని స్టార్ హోటల్స్ నిర్మాణానికి ముందుకు వస్తున్నట్టు చెప్పారు. త్వరలోనే ఏపీలో 50 వేల రూమ్‌ల నిర్మాణం జరగాలన్న పట్టుదలతో ముఖ్యమంత్రి పర్యాటక శాఖకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. గేట్‌వే హోటల్ అధినేత రాజయ్య మాట్లాడుతూ...ఏపీలో టూరిజం అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా ఐటీ కంపెనీలు పెరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. తద్వారా టూరిజం అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని చెప్పారు. ఏపీలో ఉన్న సముద్ర తీరం వెంబడి రిసార్ట్స్ ఏర్పాటుకు అనుకూల వాతావరణం ఉందని, ఐటీ రంగం కూడా అదే తరహాలో ఏర్పాటు జరిగే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెడితే ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉండటం ఖాయమన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై యువత దృష్టి పెట్టాలని గ్రీన్ హోటల్ అధినేత గోకరాజు గంగరాజు అన్నారు. చంద్రబాబు టూరిజంపై రాయితీలు ప్రకటించిన నేపథ్యంలో అమరావతిలో 17 స్టార్ హోటల్స్ రానున్నాయని తెలిపారు. అర్ధరాత్రి 12 గంటల వరకు హోటల్స్ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరడంతో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు సానుకూలంగా స్పందించి అనుమతులు ఇచ్చారని తెలిపారు. ఈ తరహాలో ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఉంటే తాము ఏపీ అభివృద్ధికి మరింతగా చేయూత ఇవ్వగలమని వెల్లడించారు.

# వివాదాస్పద గ్రానైట్ క్వారీలో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న అధికారులు

యాదమరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలం బోదగుట్టపల్లె పంచాయతీలో ఉన్న వివాదాస్పద గ్రానైట్ క్వారీలో అధికారుల బృందం గురువారం తనిఖీలు నిర్వహించింది. జీపీఎస్ ద్వారా గురువారం అటవీ మైన్స్ అటవీ, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. క్వారీకున్న అనుమతులు, తవ్వకాలు, పర్మిట్ల మంజూరు వంటి వివరాలు సేకరించారు. మరో రెండ్రోజుల్లో ఆయా శాఖల నివేదికలను కలెక్టర్‌కు సమర్పించనున్నారు. మైన్స్ ఏజీ రామకృష్ణ, ఆర్‌ఐ శ్రీనివాసరావు, అటవీ శాఖ డీఆర్వో ఆనంద రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వివేక్ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన పెను ప్రమాదం

తిరుపతి(సెంట్రల్), ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి-డిబ్రూగాంల మధ్య నడుస్తున్న వివేక్ ఎక్స్‌ప్రెస్‌కు గురువారం పెనుప్రమాదం తప్పింది. కన్నియాకుమారిలో బుధవారం బయలుదేరిన ఈ ఎక్స్‌ప్రెస్ ఈరోడ్ స్టేషన్ చేరుకునే సమయానికి బి-6 ఏసి కోచ్‌కు ఎయిర్ సస్పెన్షన్ స్ప్రింగ్ లీక్ కావడాన్ని ఉద్యోగులు గుర్తించారు. అక్కడ మరమ్మతులు చేయడానికి తగిన సామగ్రి లేని కారణంగా వేగాన్ని నియంత్రించి ఎస్కార్ట్‌తో పంపారు. ఈ కారణంగా రేణిగుంటకు గురువారం 12.10 గంటలకు రావాల్సిన ఈ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4.30 గంటలకు చేరుకుంది. సుమారు 4.30 గంటలు ఆలస్యంగా వచ్చింది. ముందస్తు సమాచారంతో కోచ్ అండ్ వ్యాగన్ సాంకేతిక సిబ్బంది కోచ్ వద్దకు చేరుకుని మరమ్మతులు చేశారు. గంటకు 130 కిలోమీటర్ల లోపు ప్రయాణం చేసే విధంగా నిబంధనలు విధించి ఎస్కార్ట్‌తో పంపినట్లు అధికారులు తెలిపారు.

# సమస్యలు పరిష్కరించకపోతే 7న మహాధర్నా



పోస్టర్స్ విడుదల చేస్తున్న సీఐటీయూ నేతలు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సంస్థలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించని పక్షంలో ఈనెల 7వ తేదీన సదరన్ డిస్కం కార్పొరేట్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర స్పష్టం చేశారు. తిరుపతి విద్యుత్ సర్కిల్ కార్యాలయ సమీపంలో కార్మికులు చేపట్టిన దీక్షలు గురువారంతో 11వ రోజుకు చేరుకున్నాయి. జయచంద్ర మాట్లాడుతూ దాదాపు రెండు వారాలుగా నిరసన తెలుపుతున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. అంతకుముందు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ రెడ్డి, కుమార్, డాక్టర్ పి.సాయిలక్ష్మి, ఆర్.లక్ష్మి, సుజాత పాల్గొని రిలే దీక్షలకు సంఘీభావం తెలిపారు. నాయకులు రవి, మురళి, ప్రసాద్, హరి, విజయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : బీఎస్ఎన్ఎల్‌లో పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంస్థ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు వైఎస్ రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట గురువారం విశ్రాంత ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లు రూపంలో దొడ్డిదారిన పెన్షనర్ల సవరణ బిల్లును ప్రవేశ పెట్టడం అన్యాయమన్నారు. ఈ బిల్లు అమలైతే దేశంలో 65 లక్షల మంది పింఛనుదారులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 1972 తరహాలో పింఛను సౌకర్యాలను యధావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పింఛను పంపిణీలో పాత, కొత్త అని విభజన చేయరాదని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగయ్య, గుర్రప్ప, వెంకటయ్య పాల్గొన్నారు.

# అలసత్వం వీడి సమస్యలు పరిష్కరించండి

### కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం

కుప్పం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యల పరిష్కారంపై తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని.. అలసత్వం వీడి సమస్యల పరిష్కారానికి సత్వరం నడుం బిగించాలని రెవెన్యూ యంత్రాంగాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గురువారం కుప్పం మండల సచివాలయంలో నియోజకవర్గానికి సంబంధించిన రెవన్యూ సమస్యలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలు, వీఆర్వోలు, ఆర్‌ఐలు, సర్వేయర్లు అందరూ గ్రామాల వారీగా ప్రజల నుంచి అందిన సమస్యలను పరిష్కరించేందుకు శ్రద్ధ పెట్టాలన్నారు. ఆయా మండల తహశీల్దార్లు, ఆర్డీవో సిబ్బందిని నిరంతరం పర్యవేక్షిస్తూ సమస్యలు సత్వరం పరిష్కారమయ్యేందుకు చొరవ చూపాలన్నారు. తనతోపాటు కడా పీడీ నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికతోపాటు జన నాయకుడు గ్రీవెన్స్ సెల్‌లోనూ ప్రజలు రెవెన్యూ సమస్యలపై వినతులు ఇస్తున్నారన్నారు. వచ్చిన వినతులే పదేపదే రావడం తన దృష్టికి వచ్చిందన్నారు. రెవెన్యూ సిబ్బంది వారివారి పరిధిలో సక్రమంగా పని చేస్తే ఇటువంటి సమస్యలు ఎందుకు తలెత్తుతాయని నిలదీశారు. చాలామంది ప్రజలు నేరుగా రెవెన్యూ కార్యాలయాలకు తమ సమస్యల పరిష్కారం కోసం వెళ్తున్నారన్నారు. ఇలా కార్యాలయాలకు వస్తున్న ప్రజలను మర్యాదపూర్వకంగా పలుకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నియమ నిబంధనలకు లోబడి పనిచేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా తీర్చాలని, కాలయాపన చేయరాదని చెప్పారు. నిబంధనలు అతిక్రమించినా, సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సమస్యల పరిష్కారంలో పారదర్శకత ఉండాలన్నారు. వెబ్‌ల్యాండ్ ప్యూరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే గుర్తించిన ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా పంపిణీ వ్యవస్థతో పంపిణీ చేసే సరుకులను సకాలంలో కార్డుదారులకు అందజేయాలన్నారు. ఈ సరుకులు పక్కదారి పట్టినట్లు తెలిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మ్యుటేషన్లు, ఎఫ్‌లైన్ పిటిషన్ ఆర్వోఆర్ సంబంధిత సమస్యలపై మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించారు. కార్యక్రమంలో కుప్పం ఆర్డీవో శ్రీనివాసులు రాజు, డీఎస్‌వో శంకర్,కుప్పం, గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం తహశీల్దార్లు చిట్టిబాబు, సీతారాం, కౌలేష్, శివయ్య, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కొనసాగిన ఆర్టీసీ కార్మికుల నిరసన



కుప్పం ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

కుప్పం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికులు చేస్తున్న నిరసన రెండో రోజూ కొనసాగింది. కుప్పం ఆర్టీసీ డిపోలో ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో రెండో రోజు గురువారం డిపో గేట్ వద్ద ఎర్ర బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఈహెచ్ఎస్ కార్డు బదులు పాత పద్ధతిలో సీలింగ్ లేని వైద్య సౌకర్యం కల్పించాలని, స్వర్గీయ పి.రామ్మోహన్‌రావు ప్రవేశపెట్టిన ఎస్ఆర్‌బీఎస్ సంక్షేమ పథకం అమలు చేయాలని, గ్యారేజ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి వారిలోని ఆందోళన తొలగించాలని, అన్ని యూనిట్లలో పెండింగ్‌లో ఉన్న ఏఏఎస్ ఇంక్రిమెంట్లు, పనిష్మెంట్ పూర్తయిన వారికి సకాలంలో ఇంక్రిమెంట్లు కలపాలని, సిబ్బందిని పనిష్మెంట్ అప్పీల్ కోసం ఏసీఎల్, హైకోర్టులో పిటిషన్ వేసేందుకు అవకాశం కల్పించాలని, ప్రైవేటు బస్సుల తాకిడి తట్టుకునే విధంగా సంస్థ పరంగా కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, కనీస విద్యార్హత లేని, అనారోగ్యంతో ఉన్న డ్రైవర్లను కండెక్టర్ అండ్ డ్రైవర్ రెండు డ్యూటీలు టిమ్‌తో బలవంతంగా పంపే పద్ధతి మానుకోవాలని, సంస్థలో డిపోల్లో సీనియారిటీ గాని, ఒక పద్ధతి లేకుండా ఓడీలు వాడే విధానాన్ని సరిచేయాలని డిమాండ్ చేశారు. ఇంకా పలురకాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు ఎ.వేలు, డిపో అధ్యక్షుడు బొట్టు మణి, కార్యదర్శి ఇ.జయపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజీ.ప్రసాద్ కుమార్, సంయుక్త కార్యదర్శి జి.మునెప్ప, సహాయ కార్యదర్శులు ఏవీ.నారాయణ, ఎస్వీ.శ్రీను, ముస్తఫా, రమణ, జి.రహంతుల్లా, దిలీప్ కుమార్, ఎం.బాలకృష్ణ, డి.అరుణ్, ఎస్.ఆర్.రాజ, చంద్ర నాయక్, బ్రహ్మం, బీఎంవీ.రమణ, బీజీ.నాయక్, జి.నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

## పాడిరైతులకు అండగా సంగం డెయిరీ



ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న నరేంద్రబాబు

రామకుప్పం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ యడ్లపాటి వెంకట్రావు, మాజీ మంత్రి ధూళిపాళ వీరయ్యచౌదరి పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా అభ్యుదయ భావాలతో 1977లో సంగం డెయిరీ ప్రారంభించారని డెయిరీ చైర్మన్ ధూళిపాళ నరేంద్రబాబు తెలిపారు. గురువారం రామకుప్పం మండలం బందార్లపల్లెలో బల్క్‌మిల్క్ కూలింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాడిరైతుల సభలో ఆయన మాట్లాడుతూ కాలం మారుతున్నా, దశాబ్దాలు గడుస్తున్నా పెద్దల ఆశయాలకనుగుణంగా సంగం డెయిరీ పాడిరైతుల ఎదుగుదలకు అన్ని విధాలా అండగా నిలుస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 21 బల్క్‌మిల్క్ కూలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే పాడిరైతులకు గ్రాస్ కట్టర్లు, పాలు పితికే యంత్రాలు రాయితీతో అందించేందుకు ప్రణాళికి సిద్ధమవుతోందని తెలిపారు. కార్యక్రమంలో డెయిరీ సీఓవో పర్వతనేని అనిల్‌కుమార్, రాయలసీమ జోనల్ ఆర్ఎం వేంకటేశ్వర్లు, గుంటూరు జోన్ ఆర్ఎం ఆదినారాయణ, వి.కోట సాయిఈశ్వర్ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ అధినేత మోహనరావు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నాయకులు డా.సురేష్‌బాబు, మునస్వామి, పత్ర నారాయణాచారి, ఆనందరెడ్డి, నరసింహులు, అంజనేయరెడ్డి, చిన్నికృష్ణ, చలపతి, వెంకట్రామగౌడు, విశ్వనాథ్, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

## ఆడపడుచులకు అండగా చంద్రన్న



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబానికి పేదరికం నుంచి విముక్తి కలిగేలా స్వయం సహాయక సంఘాల సభ్యులుగా ఉన్న ఆడపడుచులకు సీఎం చంద్రబాబు అన్నివిధాలా అండగా నిలుస్తున్నారని ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి తెలిపారు. గురువారం రామకుప్పం వెలుగు కార్యాలయంలో అప్పులు, జీవనోపాధులకు సంబంధించి 2025-2026 వార్షిక ప్రణాళికల తయారీపై మండలంలోని సంఘాల సభ్యులు, సంఘమిత్రలు, ఎన్యూమరేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారానే పేదరిక నిర్మూలనకు చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శ్రీనివాసమూర్తి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, నాయకులు ఆంజినేయరెడ్డి, చిన్నికృష్ణ, చలపతి, వెంకట్రామగౌడు, రామ్మూర్తి, కృష్ణానాయక్, మహ్మద్‌రఫీ, జయశంకర్, గుర్రప్ప, రామకృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు తప్పనిసరి

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలు, మసీదులు, చర్చిలకు సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని బీఎన్ఆర్ పేట ఎస్ఐ వెంకటనారాయణ తెలిపారు. గురువారం చిత్తూరు రూరల్ మండలంలోని దిగువమాసాపల్లె, శెట్టిగారిపల్లెలో ఆలయాలు, చర్చిలను పరిశీలించారు. ఆయా ఆలయ కమిటీ సభ్యులకు పలు సూచనలిచ్చారు. అనంతరం బీఎన్ఆర్ పేట జూనియర్ కళాశాలలో శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు.

## ప్రతి మహిళా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఎస్పీ విజయశేఖర్ పిలుపునిచ్చారు. శక్తియాప్ అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం ఎస్వీసెట్‌లో ఇంజనీరింగ్ విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ యాప్ ద్వారా మహిళల చట్టాలను తెలుసుకోవచ్చన్నారు. మహిళా ఎస్ఐ నాగసౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రకృతి వ్యవసాయంతో రైతులకు లాభాలు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతోనే రైతులు లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాసు తెలిపారు. గంగాధరనెల్లూరు ఇండియన్‌బ్యాంక్ పక్కన ప్రకృతి వ్యవసాయంతో పండించే కూరగాయలు విక్రయించే షాపును గురువారం ప్రారంభించారు. రసాయనిక ఎరువులు విపరీతంగా వాడటం వల్ల పంట దిగుబడి తగ్గడంతోపాటు జనం కూడా వివిధ రకాల అనారోగ్యసమస్యలతో బాధ పడుతున్నారని చెప్పారు. వెలుగు ఏపీఎం ఫరీద్‌మస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీరామనవమికి కూరగాయల వితరణ



ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయానికి కూరగాయలు పంపుతున్న దాతలు

పలమనేరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి అనుబంధ ఆలయం ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామ నవమికి వచ్చే భక్తుల అన్నప్రసాదం కోసం గురువారం పలమనేరు నుంచి 12 టన్నుల కూరగాయలను దాతలు పంపారు. టీటీడీ అధికారుల అభ్యర్థన మేరకు ఇక్కడి శ్రీవారి భక్తుడు కాప్పల్లి రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో దాతలు టీటీడీ పంపిన ప్రత్యేక వాహనంలో వివిధ రకాల కూరగాయలను పలమనేరు మార్కెట్ నుంచి పంపించారు. కార్యక్రమంలో స్వామి వారి భక్తులు కాప్పల్లి రవీంద్రరెడ్డి, మిత్రబృందం సోమశేఖర్‌నాయుడు, బాబు, శ్రీకాంత్, సురేష్, మధు, తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బపై జాగ్రత్తలు అవసరం

సోమల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని పెద్దఉప్పరపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బాలాజీ తెలిపారు. గురువారం అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీల్లో 104 వాహనంలో ప్రజలకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. వేసవి దృష్ట్యా పిల్లలు, వృద్ధులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మహిళలు రక్తహీనత సమస్యలకు వైద్యపరీక్షలు క్రమంగా చేయించుకొని చికిత్సలు పొందాలన్నారు. వైద్యసిబ్బంది ఆంజమ్మ, హేమలత, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు..

## కల్లూరు మాజీ సర్పంచ్ కన్నుమూత



జుబేర్‌సాహేబ్ (ఫైల్ ఫొటో)

కల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ మాజీ సర్పంచ్ హెచ్ఎస్ జుబేర్‌సాహేబ్ (77) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. ఈయన 1986 నుంచి 1995 వరకు సర్పంచ్‌గా కొనసాగారు. పంచాయతీ అభివృద్ధికి జుబేర్‌సాహేబ్ ఎనలేని కృషి చేశారు. అప్పట్లో పులిచెర్ల మండలం చంద్రగిరి నియోజకవర్గంలో ఉండటంతో సీఎం చంద్రబాబునాయుడుతో జుబేర్‌సాహేబ్ సన్నిహితంగా ఉండేవారు. మూడు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో గురువారం మృతదేహాన్ని పలువురు సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

## భూతగాదాలో ఇరువర్గాలపై కేసు నమోదు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భూవివాదంలో ఇరువర్గాలు ఘర్షణ పడి గాయపడటంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేశ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత మంగళవారం మండలంలోని రాగానిపల్లె పంచాయతీ లక్కుంట గ్రామానికి చెందిన చెన్నారెడ్డికి రాజారెడ్డి, వాలెప్పలకు గత కొంతకాలంగా భూ తగాదాలు ఉండటంతో ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## చింతచెట్టుకు నిప్పు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగళం గ్రామ సమీపంలోని చింతచెట్టుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. గుర్తించిన గ్రామస్తులు అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. అగ్నిమాపకాధికారి సుబ్బరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీ అభివృద్ధికి గుత్తేదారులు సహకరించాలి



గుత్తేదారులతో సమావేశమైన ఆర్టీసీ అధికారులు

పలమనేరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అభివృద్ధికి గుత్తేదారులు సహకరించాలని చిత్తూరు రీజియన్ డీపీటీవో జగదీష్ అన్నారు. గురువారం పలమనేరు ఆర్టీసీ డిపో పరిధిలోని ఖాళీ స్థలాలను లీజుకు ఇచ్చే అంశంపై గుత్తేదారులతో డిపోలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీపీటీవో మాట్లాడుతూ డిపో పరిధిలో వృధాగా ఖాళీగా ఉన్న స్థలాలను లీజుకు ఇవ్వాలని.. ఆ స్థలాలను ఆర్టీసీ నిబంధనల మేరకు లీజుకు తీసుకొని ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో ఆర్టీసీ డిప్యూటీ ఈఈ చెన్నకేశవులు, ఏఈ ప్రతాప్, పలమనేరు డిపో మేనేజర్ టీకే స్వామి, గుత్తేదారులు పాల్గొన్నారు.

## సాధికార సారథులతోనే గ్రామాల అభివృద్ధి

బంగారుపాళ్యం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సాధికార సారథులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్ నాయుడు అన్నారు. గురువారం మండల పార్టీ కార్యాలయంలో క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు, గ్రామస్థాయి నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. గ్రామాల్లో ప్రతి 30 కుటుంబాలకు కుటుంబ సాధికార మిత్ర, సారథులను నియమించాలని సూచించారు. ఈనెల ఆరో తేదీలోపు ఈ ప్రక్రియను పూర్తిచేసి.. పార్టీ కార్యాలయానికి నివేదికలను అందజేయాలన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి ఎన్పీ ధరణి, కమలనాథరెడ్డి, జనార్దనగౌడ్, హేమచంద్రనాయుడు పాల్గొన్నారు.

## 'ఫైలేరియా' బాధితులకు చేయూత

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఫైలేరియా బాధితులకు ప్రభుత్వం తరఫున చేయూత అందిస్తున్నట్లు సీహెచ్‌వో శ్రీనివాసులు తెలిపారు. గంగాధరనెల్లూరు పీహెచ్‌సీ పరిధిలోని 73మంది బాధితులుండగా, ఒక్కొక్కరికి ప్లాస్టిక్ టబ్, టవల్, సోప్, ఆయింట్‌మెంట్, మగ్గును గురువారం సీహెచ్‌వో పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ శైలా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి టీడీపీ భరోసా

గుడిపాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత పురుషోత్తం కుమారుడు అలెగ్జాండర్ నెలకిందట విద్యుత్ స్తంభానికి ఢీకొని తీవ్రంగా గాయపడి తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. గురువారం టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పీఏలు కుమారస్వామి, మోహన్‌లు అలెగ్జాండర్ మృతదేహానికి నివాళి అర్పించారు. వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# పశువుల దాహార్తి తీరేనా..!

**● నిరుపయోగంగా నీటితొట్టెలు ● మూగజీవాలకు తప్పని నీటి కష్టాలు**



దిడ్డివారిపల్లె వద్ద నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టెలు



సోమల తహసీల్దార్ కార్యాలయం వద్ద దుస్థితిలో నీటి తొట్టె

సోమల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వేసవిలో పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా ఉండటంతో ప్రజలతో పాటు మూగజీవాలకు తాగునీటికి తిప్పలు తప్పడంలేదు. వీటితో పాటు మండలంలో టమోటా, వరి సాగు విస్తీర్ణం పెరిగింది. ఈక్రమంలో భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటిపోతున్నాయి. గ్రామాల్లోని నీటి పథకాల బోర్లు, చేతి పంపుల్లో నీళ్లు అడుగంటుతున్నాయి. మండలంలోని చెరువులు కుంటలు, బావుల్లో నీరు ఇంకిపోతున్నాయి. పశువుల దాహం తీర్చలేక ఇబ్బందులు పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పలు గ్రామాల్లో పశువుల దాహార్తి తీర్చడానికి గ్రామాల్లో నీటి తొట్టెలు నిర్మించారు. ఆ తొట్టెలు నిరుపయోగంగా మారాయి. పలు గ్రామాల్లో చెత్తవేయడానికి వినియోగిస్తుండటం గమనార్హం. సోమల-కందూరు రోడ్డు పక్కనే నిర్మించిన పలు నీటి తొట్టెలు డబుల్ రోడ్డు వెడల్పులో భాగంగా ధ్వంసం చేశారు. నిర్వహణ కరవవడంతో నీటి తొట్టెలు నిరుపయోగంగా మారాయి. కాంట్రాక్టర్లకు వరంగా మారాయి. పశువుల దాహార్తిని తీర్చలేకపోయారు. దీంతోపాటు అన్నమయ్య జిల్లాలోని కలికిరి, మహల్, కలకడ, గుట్టపాళెం, యల్లంపల్లె తదితర ప్రాంతాల గొర్రెల యజమానులు వారి ప్రాంతంలో గొర్రెలకు కనీసం తాగునీరు అందక సోమల, కందూరు, వల్లిగట్ల తదితర ప్రాంతాలకు గొర్రెల మందలతో వలస వచ్చారు. సోమల మండలంలో ఆవులు 11 వేలు, గొర్రెలు, మేకలు 23 వేలు ఉన్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ చందనప్రియ తెలిపారు.

అడవులకు నిప్పు పెట్టడంతో అటవీ ప్రాంతంలో నీటి వనరులు లేకపోవడంతో వన్యప్రాణులు అటవీ శివారు గ్రామాల్లోని పొలాల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. గ్రామాల్లో అలంకారప్రాయంగా మారిన తొట్టెలకు పంచాయతీ నిధులతో మరమ్మతులు చేయించి నీటి సరఫరా చేసి మూగజీవాల దాహార్తిని తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

### నీటితొట్టెలకు ప్రతిపాదనలు పంపాం



వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అధికారుల ఆదేశాలు వచ్చిన వెంటనే ప్రతి గ్రామంలో నీటి తొట్టెలు ఏర్పాటు చేస్తాం. అన్నెమ్మగారిపల్లె, ఆవులపల్లె, పెద్దఉపగరపల్లె పంచాయతీల్లో పశువులు, గొర్రెలు అధికంగా ఉన్నాయి.

- డాక్టర్ చందనప్రియ, పశువైద్యాధికారి, సోమల

### మూగజీవాలను చూస్తే కడుపు తరుక్కుపోతోంది



వేసవిలో పశువుల దాహం తీర్చుకోవడానికి నానా ఇబ్బంది పడుతున్నాం. గ్రామ సమీపంలో నీటి తొట్టెను నిర్మించి చేతులు దులుపుకున్నారు. తొట్టెను నీటితో నింపిన పాపానపోలేదు. ధికారులు చొరవ తీసుకొని నీటి తొట్టెలను వినియోగంలోకి తీసుకురావాలి. ఆ అడవుల్లోని దుప్పులు, నెమళ్లు, అడవిపందులు అక్కడ నీళ్ల లేక పొలాల్లోకి వస్తున్నాయి. అటవీ అధికారులు వన్యప్రాణుల దాహం తీర్చేందుకు అటవీ ప్రాంతంలో నీటి కొలనులు నిర్మించాలి.

- శ్రీనివాసులు, మేటిమంద, సోమల మండలం

### తొట్టెలకు నీటిని సరఫరా చేయాలి



గత టీడీపీ హయాంలో నిర్మించిన తొట్టెలు నిరుపయోగంగా మారాయి. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లు పట్టించుకోలేదు. ఇప్పుడైనా పశువుల దాహం తీర్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. వేసవి పరిస్థితులతో చెరువుల్లో నీటి మట్టం తగ్గిపోతుంది. పల్లెల్లో టమోటా, వరి విస్తీర్ణం పెరిగింది. సాగుకు నీటి సమస్య కష్టంగానే ఉంది. కుంటల్లో నీరు ఉండటం లేదు. మూగజీవాల కోసం అధికారులు చర్యలు తీసుకోవాలి.

- నాగరాజు, సోమల మండలం

## మున్సిపాలిటీకి గుర్తింపు తీసుకురావాలి



రవిరెడ్డిని సన్మానిస్తున్న కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పన్నుల వసూళ్లలో జిల్లాలో మొదటి స్థానంలోను .. రీజియన్‌లో ద్వితీయ స్థానం, రాష్ట్ర స్థాయిలో ఎనిమిదో స్థానంలో నిలిపేందుకు సహకరించిన మున్సిపల్ సిబ్బంది మున్సిపాలిటీకి ఈసారీ గుర్తింపు తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి కోరారు. గురువారం పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరం పన్ను వసూళ్లలో మున్సిపాలిటీకి గుర్తింపు తీసుకొచ్చిన ఆర్.ఓ రవిరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జి.యోగరంజని, షరాబు కె.కిరణ్‌కుమార్, బిల్ కలెక్టర్ శివకుమార్, రెవెన్యూ సిబ్బందిని శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, డీఈ సురేష్‌బాబు, ఏఈ స్నేహప్రియ, టీపీఎస్ ఇందిర, మున్సిపల్ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఓబీసీ నుంచి సంచార జాతులను వేరు చేయండి



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర సంచార జాతుల సంఘం నాయకులు

పలమనేరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని రంగాల్లో వెనుకబడిన సంచార జాతులను ఓబీసీ నుంచి వేరుచేయాలని కోరుతూ గురువారం రాష్ట్ర సంచార జాతుల సంఘం అధ్యక్షులు పూసల రవి తదితరులు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు అమరావతిలో గవర్నర్ నివాసంలో కలిసి వినతి పత్రం అందించారు. సంచార జాతులను ఒక గ్రూపుగా చేసి భారత రాజ్యాంగం ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు ఏవిధంగా ప్రయోజనాలు ఉన్నాయో అన్నీ సంచార జాతులకు వర్తించాలని.. 10 శాతం రిజర్వేషన్ కల్పించే విధంగా అసెంబ్లీలో ఆమోదించాలని కోరారు. ఇప్పటికే ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేశామని సంఘం అధ్యక్షులు పూసల రవి తెలిపారు.

## నేరేడు చెట్టంతా పూతే..!



అల్లనేరేడు చెట్టంతా పూతే

సోమల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అల్లనేరేడు చెట్టంతా పూత విరగ్గాసింది. మామిడి కాపులో నిరాశ పడుతున్న రైతన్న పొలాల వద్ద ఉన్న అల్లనేరేడు చెట్లతో కొంత ఊరట పొందుతున్నారు. సోమల మండలంలోని పెద్దఉప్పరపల్లె, కరకమంద, నెల్లిమంద, ఇరికిపెంట, సోమల తదితర ప్రాంతాల రైతులు మామిడి తోటల్లో మామిడితో పాటు అల్లనేరేడు చెట్లను నాటుకున్నారు. ప్రస్తుతం అల్లనేరేడు పూత దశలో ఉన్నాయి. అల్లనేరేడు చెట్లను వ్యాపారులు పోటీలు పడి ఏడాది ఫలసాయాన్ని కొనుగోలు చేస్తున్నారు. సీజన్‌లో కిలో రూ.200 వరకు వ్యాపారులు అమ్మకాలు చేస్తున్నారు. వ్యాపారస్తులే అల్లనేరేడు చెట్లుకు మందల పిచికారీ చేపడుతున్నారు. ఒక్కో చెట్టుకు రూ.30 వేలు నుంచి రూ .80 వేలు వరకు రైతులు ఫలసాయాన్ని, పుంగనూరు, పలమనేరు, తిరుపతి, మదనపల్లె వ్యాపారులకు అమ్మకాలు చేస్తున్నారు.

## యాళి, సింహ వాహనాలపై అగస్తీశ్వరుడు



యాళి వాహన సేవలో పాల్గొన్న ఉభయదారులు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కామాక్షి అంబికా సమేత అగస్తీశ్వరాలయంలో జరుగుతున్న పంగుణి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు యాళి, సింహ వాహనాలపై విహరించారు. ఆలయ అర్చకుడు శివకుమార్ శివాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. ఈవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గ్రామోత్సవం జరిగింది. ఉత్సవ సేవలో కాలభైరవ ట్రస్టు వ్యవస్థాపకుడు టి.వెంకటేషన్ దంపతులు, స్వర్ణకారుల సంఘం నాయకుడు మల్లిఆచారి దంపతులు పాల్గొన్నారు. ఉదయం వైజయచంద్ర నాయుడు ఉభయంతో యాళి వాహన సేవ, సాయంత్రం బాల గురునాథ్, వి.సురేంద్రకుమార్, కె.సాంబశివనాయుడు, జీవీవెంకటేశ్వర చౌదరి కుటుంబీకుల ఉభయంతో సింహ వాహన సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వృద్ధురాలి ఆత్మహత్య

రామకుప్పం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రామకుప్పం మండలం వెంకటాపురంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వెంకటాపురానికి చెందిన గౌరమ్మ(63) గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందినా ఆమెకు కడుపు నొప్పి తగ్గలేదు. దీంతో బుధవారం రాత్రి ఆమె గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గురువారం ఉదయం రైతులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## 6న కంటి వైద్యశిబిరం

పలమనేరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఈనెల 6న ఆదివారం ఉచిత నేత్ర చికిత్సా శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షులు ప్రభాకర్ తెలిపారు. ఈ శిబిరంలో చెన్నై శంకర నేత్రాలయ నేత్రవైద్యులు మురళి నేత్రపరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## నేటి నుంచి వీరాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

పుంగనూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని హనుమంతరాయదిన్నెలో వెలసిన వీరాంజనేయస్వామిస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 4న అభిషేకం, అంకురార్పణ, 5న గ్రామోత్సవం, ధ్వజారోహణం, 6న యాగశాల ప్రవేశం, 7న రథోత్సవం, 8న దోపోత్సవం, 9న వసంతోత్సవం, చక్రస్నానం, ధ్వజారోహణం, శయనోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకోవాలని కోరారు.

## నరసింహ స్వామి అలంకరణలో మహావిష్ణువు




చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గిరింపేట సీబీ రోడ్డులోని వీరాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం నరసింహస్వామి అలంకరణలో మహావిష్ణువు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అలంకరణ ఉభయదారులు, భక్తులకు ఆలయ అర్చకులు, నిర్వాహకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## నేడు సాయిబాబా ఆలయ కుంభాభిషేకం

బంగారుపాళ్యం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పాలేరు పంచాయతీ జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన షిరిడీ సాయిబాబా ఆలయ కుంబాభిషేకం శుక్రవారం జరగనుంది. గురువారం గణేష్‌గురుకుల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు.

# ఈ రహదారులనూ బాగు చేయండి

స్థానికుల విజ్ఞప్తి


ఎం.అగరం - చివ్వాడ రోడ్డు


ముత్యాలరెడ్డి కండ్రిగ - మంగళం రోడ్డు


ఆలపాక కండ్రిగ - జీఎంపురం రోడ్డు

విజయపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో చాలా రోడ్లు దుస్థితికి చేరుకున్నాయి. నెట్టేరి - కనకమ్మ సత్రం రోడ్డు, పన్నూరు సబ్‌స్టేషన్ - ఒరూరు రోడ్డు, మహారాజపురం - కనకమ్మసత్రం రోడ్లను ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరమ్మతు చర్యలు చేపట్టింది. అదేవిధంగా ఆలపాక కండ్రిగ - జీఎంపురం రోడ్డు, బుగ్గ గుడి - కాళికాపురం రోడ్డు, మంగళం కండ్రిగ - క్షూరికాపురం రోడ్డు, ముత్యాలరెడ్డి కండ్రిగ - మంగళం రోడ్డు, చివ్వాడ - ఎం.అగరం రోడ్లు దుస్థితికి చేరుకున్నాయి. ఈ రోడ్లను కూడా బాగు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పాఠశాలలకు ల్యాబ్ పరికరాల వితరణ


జంబాడలో సైన్సు పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

విజయపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చిన్నప్ప రాజు ట్రస్టు, ఐఎఫ్‌టీఆర్ మద్రాసు వారి ఆధ్వర్యంలో రూ.2 లక్షల ల్యాబ్ పరికరాలను జంబాడ, శ్రీహరిపురం, విజయపురం, పన్నూరు, గంగమాంబాపురం ఉన్నత పాఠశాలలకు వితరణ చేశారు. వీటిని గురువారం జంబాడ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ద్వారా అందజేశారు. అనంతరం పాఠశాలలో సైన్సు ల్యాబ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ట్రస్టు ఛైర్మన్ కృష్ణంరాజు, ఐఎఫ్‌టీఆర్ టీమ్ డాక్టర్ దేవనాధన్, శేషాద్రి, ఇరులాండీ, వాకర్ అసోషియేషన్ అధ్యక్షుడు రవిరాజు, పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, నాయకులు లక్ష్మీపతిరాజు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా ఫ్లెక్సీలు పెడితే చర్యలు: కమిషనర్

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహప్రసాద్ హెచ్చరించారు. గురువారం నగరపాలక కార్యాలయంలో ఫ్లెక్సీల ముద్రణ యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. నగరంలో విచ్చలవిడిగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారని, వీటివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. అనుమతి తీసుకుని.. టౌన్ ప్లానింగ్ అధికారులు చెప్పిన ప్రాంతాల్లోనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నగరి బార్ అసోసియేషన్ కార్యవర్గం


న్యాయమూర్తి విష్ణువర్మను కలిసిన నూతన కార్యవర్గ సభ్యులు

నగరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నగరి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. అధ్యక్షుడిగా వేలాయుధం, ఉపాధ్యక్షుడిగా నాగరాజు, కార్యదర్శిగా జాన్‌జోష్, సహాయకార్యదర్శిగా తిరుమల, కోశాధికారిగా అరుణ్ ఎంపికయ్యారు. అనంతరం జడ్జి విష్ణువర్మను నూతన కార్యవర్గం కలగా ఆయన అభినందించారు.

## సీసీ కెమెరాలు తప్పనిసరి


శెట్టిగారిపల్లెలో ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకటనారాయణ

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలు, మసీదులు, చర్చిలకు సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని బీఎన్ఆర్ పేట ఎస్ఐ వెంకటనారాయణ తెలిపారు. గురువారం చిత్తూరు రూరల్ మండలంలోని దిగువమాసాపల్లె, శెట్టిగారిపల్లెలో ఆలయాలు, చర్చిలను పరిశీలించారు. ఆయా ఆలయ కమిటీ సభ్యులకు పలు సూచనలిచ్చారు. అనంతరం బీఎన్ఆర్ పేట జూనియర్ కళాశాలలో శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు.

## సాధికార సారథులతోనే గ్రామాల అభివృద్ధి: టీడీపీ


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎన్పీ జయప్రకాష్

బంగారుపాళ్యం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సాధికార సారథులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్ నాయుడు అన్నారు. గురువారం మండల పార్టీ కార్యాలయంలో క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు, గ్రామస్థాయి నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. గ్రామాల్లో ప్రతి 30 కుటుంబాలకు కుటుంబ సాధికార మిత్ర, సారథులను నియమించాలని సూచించారు. ఈనెల ఆరో తేదీలోపు ఈ ప్రక్రియను పూర్తిచేసి.. పార్టీ కార్యాలయానికి నివేదికలను అందజేయాలన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి ఎన్పీ ధరణి, కమలనాథ రెడ్డి, జనార్దనగౌడ్, హేమచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకోవాలి


చిన్నారులకు పరికరాలను అందిస్తున్న ఎంఈవో దామోదరం

వెదురుకుప్పం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భవిత కేంద్ర పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో దామోదరం తెలిపారు. గురువారం పచ్చికాపల్లం భవిత కేంద్రంలో 'ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు' వీల్ ఛైర్, హీరింగ్ కిట్లు, రోలేటర్, సీపీ ఛైర్‌ను పంపిణీ చేశారు. హెచ్ఎంలు సిద్ధయ్య, రవికుమార్, భవిత కేంద్ర టీచర్లు శ్యామల, గుణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సంతవేలంతో రూ.7.50 లక్షల ఆదాయం

యాదమరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): యాదమరి సంత వేలంపాట ద్వారా యాదమరి పంచాయతీకి రూ.7.50 లక్షల ఆదాయం చేకూరిందని ఈవోపీఆర్డీ సుకుమార్ రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం జరిగిన ఈ వేలంపాటలో చిన్నంపల్లెకి చెందిన జార్జి.. ఏడాది కాలానికి రూ.7.50లక్షలకు దక్కించుకున్నారు.



# అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలివ్వండి: సీపీఐ


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. తిరుపతి-బెంగళూరు బైపాస్ వద్ద తేనబండలో సుమారు 90మంది పేదలు పునాదులు వేస్తే అప్పటి ప్రభుత్వంలో వాటిని కూల్చి వేశారన్నారు. తర్వాత వారందరికీ అనుపల్లి కొత్త లేఅవుట్‌లో పట్టాలు మంజూరు చేసింది కానీ స్థలాలు కేటాయించలేదని చెప్పారు. అర్హులందరికీ స్థలాలు కేటాయించాలంటూ తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సీపీఐ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుడికి నివాళి


రామయ్య మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికుడు రామయ్య మృతదేహం వద్ద నగరపాలక సంస్థ మేయర్ అముద, కమిషనర్ నరసింహప్రసాద్, ఎంహెచ్‌వో లోకేష్‌లు నివాళి అర్పించారు. ఐరాల మండలం మఠంపల్లెకు వెళ్లి రామయ్య కుటుంబీకులకు ప్రభుత్వం తరఫున మట్టి ఖర్చుల కోసం రూ.15వేలను అందించారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

## ఇంటి నుంచి చెత్త సేకరణపై ప్రచారం


వెదురుకుప్పంలో చెత్త సేకరిస్తున్న సిబ్బంది

వెదురుకుప్పం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి చెత్త సేకరణపై గురువారం ప్రచారం కల్పించామని ఇన్‌చార్జి ఎంపీడీవో పురుషోత్తం తెలిపారు. ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరించడానికి పచ్చికాపల్లం, కొమరగుంట, వెదురుకుప్పం, పాతగుంట, నల్లవెంగనపల్లి పంచాయతీలు ఎంపికయ్యాయని చెప్పారు. ఈ పంచాయతీల్లో గురువారం మైక్ అనౌన్స్‌మెంటు, కరపత్రాలు, ఫ్లెక్సీలు, స్వయం సహాయక సంఘాల ద్వారా ఐవీఆర్ఎస్ కార్యక్రమాన్ని అందరికీ తెలియపరిచామన్నారు.

## చంద్రబాబును కలిసిన గంధమనేని



శ్రీరంగరాజపురం, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును గురువారం ఎస్ఆర్ పురం టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు మండల ఉపాధ్యక్షుడు నిరంజన్ రెడ్డి ఉన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో రైతులకు లాభాలు


ఫరీద్ మస్తాన్‌కు కూరగాయల బ్యాగ్‌ను అందజేస్తున్న వాసు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతోనే రైతులు లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాసు తెలిపారు. గంగాధరనెల్లూరు ఇండియన్ బ్యాంక్ పక్కన ప్రకృతి వ్యవసాయంతో పండించే కూరగాయలు విక్రయించే షాపును గురువారం ప్రారంభించారు. రసాయనిక ఎరువులు విపరీతంగా వాడటం వల్ల పంట దిగుబడి తగ్గడంతోపాటు జనం కూడా వివిధ రకాల అనారోగ్యసమస్యలతో బాధ పడుతున్నారని చెప్పారు. వెలుగు ఏపీఎం ఫరీద్‌మస్తాన్, సబ్‌డివిజనల్ యాంకర్ హేమావతి, మాస్టర్ ట్రైనర్ సుధాకర్‌నాయుడు, షాపు నిర్వాహకురాలు శిరీష మూర్తి పాల్గొన్నారు.

## యాళి, సింహ వాహనాలపై అగస్త్యేశ్వరుడు


యాళి వాహన సేవలో పాల్గొన్న ఉభయదారులు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయంలో జరుగుతున్న పంగుణి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు యాళి, సింహ వాహనాలపై విహరించారు. ఆలయ అర్చకుడు శివకుమార్ శివాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. ఈవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గ్రామోత్సవం జరిగింది. ఉత్సవ సేవలో కాలభైరవట్రస్టు వ్యవస్థాపకుడు టి.వెంకటేషన్ దంపతులు, స్వర్ణకారుల సంఘం నాయకుడు మల్లి ఆచారి దంపతులు పాల్గొన్నారు. ఉదయం వైజయచంద్ర నాయుడు ఉభయంతో యాళి వాహన సేవ, సాయంత్రం బాల గురునాథ్, వి.సురేంద్రకుమార్, కె.సాంబశివనాయుడు, జీవీ వెంకటేశ్వర చౌదరి కుటుంబీకుల ఉభయంతో సింహ వాహన సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## కోదండరామాలయ వార్షికోత్సవం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

నగరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గుండ్రాజుకుప్పం పంచాయతీ రాజులకండ్రిగలోని కోదండరామస్వామి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం హోమం, కోదండరాముల కల్యాణోత్సవం జరిగింది. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఏడు గంటలకు కోదండరాములను పురవీధుల్లో ఊరేగించారు.

## నరసింహ స్వామి అలంకరణలో మహావిష్ణువు



చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గిరింపేట సీబీ రోడ్డులోని వీరాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం నరసింహస్వామి అలంకరణలో మహావిష్ణువు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అలంకరణ ఉభయదారులు, భక్తులకు ఆలయ అర్చకులు, నిర్వాహకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## 'ఓబీసీ నుంచి సంచార జాతులను వేరు చేయండి'

పలమనేరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని రంగాల్లో వెనుకబడిన సంచార జాతులను ఓబీసీ నుంచి వేరుచేయాలని కోరుతూ గురువారం రాష్ట్ర సంచార జాతుల సంఘం అధ్యక్షులు పూసల రవి తదితరులు గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు అమరావతిలో కలిసి వినతిపత్రం అందించారు. సంచార జాతులను ఒక గ్రూపుగా చేసి భారత రాజ్యాంగం ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు ఏవిధంగా ప్రయోజనాలు ఉన్నాయో అన్నీ వర్తింపజేయాలని, 10శాతం రిజర్వేషన్ కల్పించే విధంగా అసెంబ్లీలో ఆమోదించాలని కోరారు. ఇప్పటికే ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశామని సంఘం అధ్యక్షుడు పూసల రవి తెలిపారు.

## భూతగాదాలో ఇరువర్గాలపై కేసు నమోదు


పుంగనూరు రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భూవివాదంలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు గురువారం ఎస్ఐ లోకేశ్ తెలిపారు. గత మంగళవారం పుంగనూరు మండలంలోని రాగానిపల్లె పంచాయతీ లక్కుంట గ్రామానికి చెందిన చెన్నారెడ్డికి రాజారెడ్డి, వాలెప్పలకు కొంతకాలంగా భూ తగాదాలు ఉండటంతో ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## వృద్ధురాలి ఆత్మహత్య

రామకుప్పం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పి భరించలేక ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రామకుప్పం మండలం వెంకటాపురంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వెంకటాపురానికి చెందిన గౌరమ్మ(63) గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందినా ఆమెకు కడుపు నొప్పి తగ్గలేదు. దీంతో బుధవారం రాత్రి ఆమె గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గురువారం ఉదయం రైతులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

# వెలుగు కార్యాలయ భవన నిర్మాణం పూర్తయ్యేదెప్పుడు?

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండల వెలుగు కార్యాలయ పక్కా భవన నిర్మాణానికి మోక్షం ఎప్పుడు లభిస్తుందోనని డ్వాక్రా మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని డ్వాక్రా మహిళలతో పాటు అక్కడ పనిచేసే వెలుగు అధికారులు సైతం ఏళ్ల తరబడి నానా అవస్థలు పడుతూ చాలీచాలనీ అద్దెభవనాల్లోనే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. గంగాధరనెల్లూరులో వెలుగు కార్యాలయానికి పక్కాభవనం సౌకర్యంలేక సుమారు 25 ఏళ్లగా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. 2000వ సంవత్సరం నుంచి గంగాధరనెల్లూరులో ఈ కార్యాలయం వేర్వేరు చోట్ల ఐదు అద్దె భవనాల్లో ఇప్పటికీ కొనసాగుతోంది. 2011లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ సహకారంతో ఈ భవన నిర్మాణానికిగాను రూ.25లక్షలు మంజూరు చేశారు. అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు ఎగవూరులో వాటర్ ట్యాంక్‌వద్ద స్థలాన్ని ఎంపికచేయగా, 2011లో కుతూహలమ్మ చేతులమీదుగా భవన నిర్మాణానికిగాను శంకుస్థాపన చేశారు. ఆ భవన నిర్మాణ పనిని తీసుకున్న అప్పటి ప్రధాన నేత పిల్లర్లతో బేస్‌మెంట్ వరకు చేసేసరికి, ఈ పనులపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అప్పట్లో మాజీ సర్పంచ్ కోర్టును ఆశ్రయించడంతో అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో ఆ భవనంలో ముళ్ల కంపలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయి విషసర్పాలకు నిలయంగా మారింది. బేస్‌మెంట్‌లో పిల్లర్ల కోసం కట్టిన కమ్మీలు వర్షాలకు తడిసి, ఎండకు ఎండి తుప్పుపట్టిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఉన్న నారాయణస్వామికి ఈ భవన నిర్మాణ పనులపై పలుసార్లు విన్నవించినా, ఏమాత్రం స్పందన లేకపోయింది. ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌తోపాటు సంబంధిత జిల్లా అధికారులు స్పందించి పాత వెలుగు కార్యాలయ భవన నిర్మాణాలు సాగించి పూర్తిచేయవచ్చా లేదా అనేది ఇంజనీరింగ్ అధికారులతో పర్యవేక్షించాల్సి ఉంది. అలా కుదరని పక్షంలో బేస్‌మెంట్ పూర్తిగా తొలగించేసి కొత్తగా వెలుగు కార్యాలయ భవనాన్ని నిర్మించాలని డ్వాక్రా మహిళలు కోరుతున్నారు.



గుమ్మడి కుతూహలమ్మ హయాంలో వేసిన శిలాఫలకం
బేస్‌మెంట్‌కే పరిమితమైన భవన నిర్మాణం

# సంక్షిప్తంగా..

## రీసర్వేపై నేడు గ్రామసభ

గుడిపాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చీలాపల్లెలో శుక్రవారం ఉదయం రీసర్వేపై గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయంతి, ఆర్ఐ రామసాయి తెలిపారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ.. రీసర్వేలో భూములకు సంబంధించి ఏదైనా సమస్యలుంటే రైతులు అర్జీ ఇస్తే విచారించి, న్యాయం చేస్తామని చెప్పారు.

## వరసిద్ధుడి సేవలో ఐఆర్ఎస్ దంపతులు

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని గురువారం ఐఆర్ఎస్ దంపతులు చైతన్యకృష్ణ, హర్షిత దర్శించుకున్నారు. ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.

## వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకూడదు

నగరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీహరి ఆదేశించారు. నగరి సబ్‌డివిజన్ కార్యాలయంలో గురువారం జరిగిన ఏఈలు, ఇంజనీరింగు అసిస్టెంట్లు, మెకానిక్‌ల సమావేశంలో ఆయన ప్రసంగించారు. గ్రామ సచివాలయాల వద్ద కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఓవర్‌హెడ్ ట్యాంకులకు ఇన్‌లైన్ క్లోరినేషన్ డివైజ్‌లను అమర్చాలని శ్రీహరి సూచించారు.

## 'ఫైలేరియా' బాధితులకు చేయూత

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఫైలేరియా బాధితులకు ప్రభుత్వం తరఫున చేయూత అందిస్తున్నట్లు సీహెచ్‌వో శ్రీనివాసులు తెలిపారు. గంగాధరనెల్లూరు పీహెచ్‌సీ పరిధిలోని 73మంది బాధితులుండగా, ఒక్కొక్కరికి ప్లాస్టిక్ టబ్, టవల్, సోప్, ఆయింట్‌మెంట్, మగ్గును గురువారం సీహెచ్‌వో పంపిణీచేశారు. సూపర్‌వైజర్ శైలా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## 'మాల' కార్పొరేషన్ డైరెక్టర్‌గా యుగంధర్ బాధ్యతల స్వీకారం



వెదురుకుప్పం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా జీడీనెల్లూరు జనసేన ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లిలోని సంస్థ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

## బాధిత కుటుంబానికి భరోసా

గుడిపాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత పురుషోత్తం కుమారుడు అలెగ్జాండర్ నెలకిందట విద్యుత్ స్తంభానికి ఢీకొని తీవ్రంగా గాయపడి తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. గురువారం టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పీఏలు కుమారస్వామి, మోహన్‌లు అలెగ్జాండర్ మృతదేహానికి నివాళి అర్పించారు. వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, మాజీ ఎంపీపీ నాగరాజ యాదవ్, టీడీపీ నాయకులు శివలింగారెడ్డి, ఏకాంబరం, సుబ్రహ్మణ్యం, సాంబశివనాయుడు, గోపి తదితరులు ఉన్నారు.

## ప్రతి మహిళా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి: డీఎస్పీ

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఎస్పీ విజయశేఖర్ పిలుపునిచ్చారు. శక్తియాప్ అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం ఎస్వీసెట్‌లో ఇంజనీరింగ్ విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ యాప్ ద్వారా మహిళల చట్టాలను తెలుసుకోవచ్చన్నారు. మహిళా ఎస్ఐ నాగసౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు సాయిబాబా ఆలయ కుంభాభిషేకం

బంగారుపాళ్యం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పాలేరు పంచాయతీ జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన షిరిడీ సాయిబాబా ఆలయ కుంభాభిషేకం శుక్రవారం జరగనుంది. గురువారం గణేష్‌గురుకుల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు.